నేటి నిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 14-8-2025

## నవ్వు

నవ్వితే నీ సొమ్మేం పోయింది!
ఒక్కసారి నవ్వు
ఈ రోజంతా కాంతివంత మౌతుంది.

అనర్ఘనీ, అమూల్యం
అపురూపం కదా నవ్వు
మాటకు తొడిగిన
మాధుర్యం కదా నవ్వు .

నవ్వేది కేవలం పెదవులే కాదు
దంతాలే కాదు, కనులే కాదు
హృదయంలోని
వంద సూర్య దీపమ్ములు
భగ్గున జ్వలించే దృశ్యరవమ్ములు
భగవంతుడు
మనిషికి ప్రసాదించిన వరమ్ము నవ్వు
నువ్వు చిరు నవ్వితే
చీకట్లో గూడా నాకు తెలుస్తుంది.
మిత్రమా!
ఒక్కసారి నవ్వు
నువ్వు చనిపోయిన తర్వాత కూడా
ఎదుటి వారి గుండెల్లో
రోచిర్విలాసమై గుర్తుంటుంది.

నవ్వును మించిన అభివ్యక్తి లేదు
నవ్వితే పువ్వులు రాలుతాయి
నవ్వితే కన్నీళ్లు
రవ్వల్లా మెరుస్తాయి.



-డా॥ ఎన్. గోపి
సెల్:9391028496

# తెలుగు భాషా సాహిత్య వికాసానికి కృషి చేసిన 'పోతుకూచి'



ఆగష్టు 6న హైదరాబాద్‌లోని అశోక్‌నగర్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో ప్రముఖ న్యాయవాది, కవి, రచయిత విశ్వరచన మాసపత్రిక సంపాదకులు "డా॥ పోతుకూచి స్మారక సంచిక" ఆవిష్కరణలో జి. పద్మావతి, శ్రీ ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, పొత్తూరి సుబ్బారావు, వంశీ రామరాజు, ఆచార్య కడారి సత్యమూర్తి,ఆచార్య టీ. గౌరీశంకర్, బైస దేవదాసు, తంగిరాల చక్రవర్తి తదితరులు.

అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళనం (ఏబీబీఎస్ఎస్) సంయుక్త ఆధ్వర్యంలో కళాప్రపూర్ణ డా॥పోతుకూచి సాంబశివరావు 8వ వర్ధంతి సభ జరిగింది. ఈ కార్యక్రమం అశోక్‌నగర్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో నిర్వహించారు. తెలుగు విశ్వ విద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ డా॥ టీ. గౌరీశంకర్, ఏబీబీఎస్ఎస్ అధ్యక్షులు ఆచార్య కడారి సత్యమూర్తి, వంశీ సంస్థల అధినేత డా॥ వంశీ రామరాజు, 'నేటినిజం' సంపాదకులు బైస దేవదాసు, 'సాహితీ కిరణం' సంపాదకులు పొత్తూరి సుబ్బారావు, ఆచార్య డా॥కసిరెడ్డి వెంకటరెడ్డి భారతీయ సాహిత్య పరిషత్ పూర్వ అధ్యక్షులు-అతిథులుగా హాజరయ్యారు. విశ్వసాహితీ జాయింట్ సెక్రటరీ తంగిరాల చక్రవర్తి, విశ్వసాహితీ సెక్రటరీ గోళ్ళమూడి పద్మావతి కార్యక్రమాన్ని సమన్వయం చేసారు. ఈ సందర్భంగా సామాజిక అంశాలపై కవి సమ్మేళనం జరిగింది. డా॥ పోతుకూచి స్మారక సంచిక 'విశ్వ రచన' సావనీర్‌ను శిరో మణి వంశీ రామరాజు ఆవిష్కరించారు. టీ. గౌరీ శంకర్ మాట్లాడుతూ 90 సంవత్సరాల పరిపూర్ణ జీవితాన్ని పోతుకూచి జీవించారని అన్నారు. పోతుకూచి దశావతారాలుగా తన ప్రతిభ చూపారని కథా రచయిత, కవి, నాటక రచయిత, నటుడు, రాజకీయనేత, సంస్థ అధినేత, పత్రికా సంపాదకులు, న్యాయవాది, ఆధ్యాత్మికత.. ఇలా పలు అంశాలపై పోతుకూచి బహుముఖ ప్రజ్ఞ చూపారని అన్నారు. వంశీ రామరాజు మాట్లాడుతూ పోతు కూచి జయంతిని పురస్కరించుకుని తాము ఓ అవార్డును అందిస్తామని సంస్థ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. పొత్తూరి సుబ్బారావు మాట్లాడుతూ పోతుకూచి విశ్వరచన పత్రిక ద్వారా గొప్ప సాహితీసేవ చేసారని అన్నారు. పత్రికా నిర్వహణకు పోతుకూచిని తాను మార్గదర్శకంగా చేసుకున్నానని, పోతుకూచి సూచనలను తాను మార్గదర్శకంగా తీసుకున్నానని బైస దేవదాసు పేర్కొన్నారు. కసిరెడ్డి ఆచార్య వెంకటరెడ్డి మాట్లాడుతూ పోతుకూచి సంపూర్ణ వ్యక్తిత్వాన్ని ఓ కవిత ద్వారా వివరించారు. తంగెళ్ళ పల్లి, పొన్నం రాజయ్య గౌడ్, లలిత, పెద్దూరి వెంకటదాసు, ఆకెళ్ల వెంకట సుబ్బలక్ష్మి, లలితా చండీ, రవీంద్ర, సత్యభాస్కర్ తదితరులు కవి సమ్మేళనంలో కవితా గానం చేసారు. తెలుగు భాషా సాహిత్య వికాసానికి పోతుకూచి విశేష కృషి చేసారని సాహితీవేత్తలు ఘన నివాళులు అర్పించారు. పోతుకూచి సాంబశివరావు పట్ల ఎంతో అభిమానంతో 8వ వర్ధంతి సభకు వచ్చి పోతుకూచిలో తమ తమ అనుబంధాన్ని వివరించి ఆయన గొప్ప తనాన్ని చాటి చెప్పినందుకు ఆచార్య కడారి సత్యమూర్తి ధన్యవాదాలు తెలిపారు.

# ప్రజల కోసం కవి కలం పారాలి

-రేలంగి నరసింహారావు



"కవితావిక' కవితా సంపుటి ఆవిష్కరణలో రఘుశ్రీ, ఆచార్య పి.వి. ఉమాశశి, బైస దేవదాసు, ఆవిష్కర్త సినీ దర్శకులు రేలంగి నరసింహారావు, తిరుమల వెంకటస్వామి, మధుజ్యోతి.

ప్రజలను చైతన్యం వైపు నడిపించడానికి కవి తన కలానికి పని చెప్పాలని ప్రముఖ సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు అన్నారు. గురువారం త్యాగరాయ గాన సభలో మానస ఆర్ థియేటర్స్ ఆధ్వర్యంలో తిరుమల వెంకటస్వామి (టి.వి.స్వామి) రచించిన "కవితావిక' కవితా సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొని కవితావిక కవితా సంపుటిని ఆవిష్కరించి రేలంగి నరసింహారావు మాట్లాడుతు నిజాలను నిర్భయంగా రాయడమే గాక ఆలోచింపజేసే కవిత్వాన్ని రాసిన టి.వి. స్వామిని అభినందించారు. ఇప్పటి వరకు 76 సినిమాలకు దర్శకత్వం వహించిన నాకు కొద్దిగా గ్యాప్ వచ్చిన మాట వాస్తవమేనని మళ్ళీ అడుగులు పడుతున్నాయని ఆ ప్రయత్నంలోనే వున్నానని అన్నారు. కళాకారుడు జీవించినంత కాలం కళ కోసమే తపిస్తాడని కవి కూడా చివరి దాకా తన కలానికి పదును పెడుతూనే వుంటాడని విరామం అంటూ వుండదని అన్నారు. సంప్రదాయాలను సమాజం మరచిపోవద్దని, మార్పు తెచ్చే కవిత్వం స్వామి రాశాడని ఆయన అభినందించారు.

సభాధ్యక్షులు బైస దేవదాసు మాట్లాడుతు 20వ యేటనే సినీ రంగంలో అడుగుపెట్టి యాభై సంవత్సరాలు దాటిందని తన 75 యేళ్ళ వయసులో 76 సినిమాలకు దర్శకత్వం వహించిన రేలంగి నరసింహారావుగారు ఎంతో మర్యాదపూర్వకంగా వుంటారని అన్నారు. హాస్యం మనిషి ఆరోగ్యాన్ని కాపాడుతుందని అలాంటి సినిమాలకు దర్శకత్వం వహించి రేలంగిగారు అందరి మన్ననలు పొందారని అన్నారు.

ముఖ్య అతిథిగా విచ్చేసి టి.వి.స్వామి 'కవితావిక' ఆవిష్కరించి సాహిత్యం ఎంతో గొప్పదని మనిషి మార్పుకు దోహదపడుతుందని స్వామిగారి కవిత్వాన్ని వినిపించి స్వామిగారిని అభినందించడం గొప్ప విషయమని అన్నారు.

ప్రజలకు పనికి వచ్చే సాహిత్యమే నిలుస్తుందని స్వామిగారు ఈ సమాజంలోని రుగ్మతలను గ్రహించి ఎన్నో అంశాలపై తన అభిప్రాయాలను కవితాత్వం చేశారని ద్రవిడ విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షులు ఆచార్య కలకలూరి మధు జ్యోతి స్వామిని అభినందించారు.

రోజు రోజుకు మానవ విలువలు తగ్గిపోతున్నాయని, స్వార్థం పెరిగిపోతోందని మధుజ్యోతి ఆందోళన వ్యక్తం చేశారు. మన రచనల ద్వారా సమాజ భవిష్యత్తును కాపాడాల్సిన అవసరం వుందని అన్నారు. స్వామిగారు ఈ కవితా సంపుటిలో జరుగుతున్న అన్యాయాలపై పలు కవితలున్నాయని మరిన్ని కవితలకు శీర్షికపెట్టకుండానే మనం ఆలోచించేట్టు చేశారని స్వామిగారిని అభినందించారు. ఈ 'కవితావిక' కవితా సంపుటిని తనకు అంకితం ఇచ్చినందులకు స్వామిగారికి ధన్యవాదాలు తెలిపారు.



"కవితావిక' కవితా సంపుటిని అంకితం స్వీకరిస్తున్న ఆచార్య మధుజ్యోతి.

ప్రముఖ విద్యావేత్త ఆచార్య పి.వి. ఉమాశశి మాట్లాడుతు ఒకప్పుడు పావలాపెట్టి చూసిన సినిమా జీవితాలను మార్చిందని, ఇప్పుడొస్తున్న సినిమాలు వందల రూపాయలు పెట్టి చూస్తే జీవితాలు కుప్పకూలుతున్నాయని అన్నారు. హాస్యంతో కూడిన సినిమాలకు దర్శకత్వం వహించి అందరి మనసులను ఆనందపరిచిన రేలంగి నరసింహారావును అభినందించారు.

టి.వి. స్వామి రచించిన ఈ 'కవతావిక' సంపుటిలో ఒక్కో కవిత సమాజంలో జరుగుతున్న సంఘటనలు జ్ఞప్తికి వస్తాయని అన్నా రు. సమాజాన్ని బాగా అధ్యయనం చేయడం వల్ల వాస్తవాలను తన అక్షరాల్లో బంధించి మనకందించారని టి.వి.స్వామిని అభినందించారు.

చదువు నేర్పినవారు సీతాకోక చిలుకలని కవి అనడం బావుందన్నారు. కులమత బేధాలు లేని నవ సమాజాన్ని కవి కలగన్నాడని ఆచార్య శశి పేర్కొన్నారు.

ఉమ్మడిసింగు రాఘవరావు మాట్లాడుతు టి.వి.స్వామి ఎంతో సౌమ్యుడని తన కవిత్వంలో మనిషిలో మార్పు రావాలని, ఆరాచకాలు తగ్గాలని, సహకార తత్వం పెరగాలని కన్పిస్తుందని తనకు మంచి స్నేహితుడుగా వున్నందుకు ఎంతో ఆనందంగా వుందని స్వామిని కొనియాడారు.

తన కవిత్వాన్ని, కథలను ప్రచురిస్తున్న వివిధ పత్రికలకు, సభను విజయవంతం చేసిన వారందరికి టి.వి.స్వామి ధన్యవాదాలు తెలిపారు.

మొదట కడియాల ప్రభాకరరావు ప్రార్థానాగీతం ఆలపించారు. పలువురు సినీ గీతాలు వినిపించారు.

# సంవేదనల సమాహారం!

పుస్తక సమీక్ష




ప్రతులకు: మామిడాల శైలజ
సెల్: 8500173819

నాదైన భావనా ప్రపంచంలో ఒంటరిగా,స్వేచ్ఛగా విహరిస్తున్న సమయంలో నా హృది లోతుల్లోంచి అంతర్గత సంవేదనల ప్రతిరూపమే నా కవిత్వమంటూ సవినయంగా ప్రకటించుకున్న కవయిత్రి మామిడాల శైలజగారు తనకు అక్షరం ఓ సాధనమనీ.. కవనం ఆమె ప్రాణమని తెలియజెబుతూ "అంతర్లీనం" కవితా సంపుటిని ప్రకటించడం ప్రశంసనీయం. తనలో చెలరేగే భావోద్వేగాలకు ప్రాణ ప్రతిష్ట చేసే ఆమె.. కవిత్వ సృజనతో సాంత్వన పొందడం విశేషం! అంతరంగంలో నాట్యం చేసే భావ తరంగాలను.. తన చుట్టూ ఉన్న ప్రపంచంలోని సమస్యలు ఆమె కలతకు గురి చేసినప్పుడు స్పందనగా ఆమె ప్రకటించిన భావాల సమాహారంగా ఈ "అంతర్లీనం" కవితా సంపుటిలోని కవితలకు జీవం పోసినట్టు శైలజ పేర్కొనడం అభినందనీయం.. ఈ కవితా సంపుటిలో కొలువుదీరిన వంద కవితలో లోగడ ఎక్కడో ఒకచోట ప్రకటించబడినవి.. ప్రచురించబడినవి.. మరికొన్ని ప్రశంసా పూర్వక పురస్కారాలు అందుకున్నవి కావడం గమనార్హం.

కవయిత్రి మామిడాల శైలజ ఉత్తమ వ్యక్తిత్వం.. సున్నిత మనస్తత్వం.. సామాజిక దృక్పథం.. లోకజ్ఞత.. మానవీయత లాంటి లక్షణాలను ఆమె ఇందులో పొందుపరిచిన కవిత్వంలో అడుగడుగున చూస్తాం.

వృత్తిరీత్యా ప్రభుత్వ కళాశాలలో రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలైన ఆమె.. కవిత్వ ఆరాధకురాలై.. రచనా వ్యాసంగాన్ని ప్రవృత్తిగా మలుచుకోవడం ప్రశంసనీయం. ఇందలి కవితల కోసం ఆమె ఎంపిక చేసుకున్న వస్తువుల్లో వైవిధ్యం ఉంది. అభివ్యక్తిలో విలక్షణమైన లక్షణత ఉంది అన్నింటికి మించి.. ఆమె అనుభవాలను.. అనుభూతులను.. సంఘర్షణలను.. అక్షరాల్లో నిక్షిప్తం చేసి. సామాజిక చైతన్యానికి ఆరాట పడే ఆరాటం ఉంది. సమాజంలోని రుగ్మతలను రూపుమాపాలన్న సంకల్పం ఉంది. తన హృదయంలో సవ్వడి చేసే భావోద్వేగాలను.. కవిత్వంలోకి ఒంపి.. సాంత్వన పొందడం, అభివ్యక్తిలో సరళత్వానికి చోటు కల్పిస్తూ అలంకారాలు.. పదాడంబరాలు.. వర్ణనలు.. పోలికలు.. వంటి అంశాల జోలికి పెద్దగా పోకుండా.. తాము ఎంపిక చేసుకున్న వస్తువులోని కంటెంట్‌ను పాఠకునికి చేరేలా తమ రచనా శైలితో ముందుకు సాగడం ముదావహం.

ఒక రకంగా చెప్పాలంటే..సరళత్వానికి పెద్ద పీట వేస్తూనే.. ఆర్తి, ఆర్ధ్రతతో కూడిన భావాలను చాలా కవితల్లో ఆవిష్కరించారు. అతివలు అనుభవిస్తున్న బాధలను.. వివక్షతను.. మసకబారుతున్న మానవ సంబంధాలకు మెరుగులు అద్దాలన్న ఆమె తపనను.. తమ మనో ఫలకంపై కదలాడే సంవేదనలను అక్షర రూపమివ్వాలన్న ఆకాంక్షను ఆమె కవిత్వంలో చూస్తాం.. భారతీయ సంస్కృతీ సంవిధానం.. ప్రపంచానికి తల మానికమనీ.. సౌభ్రాతృత్వ భావనే మన మంత్రమనీ.. విశ్వ మానవాళికి దాతృత్వం చేసే విద్వత్తు మన సొంతమని చాటి చెప్పే స్వాభిమానాన్ని ఆమె కవిత్వంలో గమనిస్తాం.

**తనలో చెలరేగే భావోద్వేగాలకు ప్రాణ ప్రతిష్ట చేసే ఆమె.. కవిత్వ సృజనతో సాంత్వన పొందడం విశేషం! అంతరంగంలో నాట్యం చేసే భావ తరంగాలను.. తన చుట్టూ ఉన్న ప్రపంచంలోని సమస్యలు ఆమె కలతకు గురి చేసినప్పుడు స్పందనగా ఆమె ప్రకటించిన భావాల సమాహారంగా ఈ "అంతర్లీనం" కవితా సంపుటిలోని కవితలకు జీవం పోసినట్టు శైలజ పేర్కొనడం అభినందనీయం..**

ప్రపంచీకరణ నేపథ్యంలో కనుమరుగవుతున్న పల్లెల్లోని చేతి వృత్తులను.. విచ్ఛిన్నమవుతున్న వివిధత్వంలోని ఏకత్వాన్ని.. శైలజగారు తమ కవిత్వం ద్వారా తెలియజెబుతూ.. పునర్ వైభవ దిశగా.. మన దేశ సంస్కృతీ సంప్రదాయాలకు మళ్లీ పట్టం కట్టే విధంగా మనందరం అడుగులు వేయాలన్న ఆమె ఆలోచనను మనతో పంచుకోవడం స్వాగతించదగింది.

మహిళ మది గదిలో గుంబనంగా.. గుట్టుగా గూడుకట్టుకున్న అంతర్గత సంఘర్షణలను. ఆశనిపాతల ఆక్రందనలను.. ఆశల దివ్వెల ఆఖరి చిటపటలను.. కలల సాకారంలో ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న కన్నీటి ఉప్పెనల్ని ఆమె తమ కవిత్వం ద్వారా తెలియజెప్పడానికి ప్రయత్నించడం ప్రశంసనీయం.. అతివ అంతరంగాన్ని ఆవిష్కరించడానికి **"నన్ను నన్నుగా"** కవితను తీర్చి దిద్దినారు. ఇకనైనా సంకుచిత శృంఖలాల బంధనాలను సడలించి.. నన్ను నన్నుగా గుర్తించుమని మహిళల పక్షాన మనవి చేశారు. అతివ ఎద లోతుల్లో దావానలంలా దహించివేస్తున్న అంతర్గత సంవేదనలకు అక్షర రూపమిచ్చారు. **'నీ రాక కోసం'** కవితలోనూ కవయిత్రి మహిళలకు స్వాభిమానాన్ని నూరిపోశారు.

జీవిత ప్రయాణం గాడి తప్పకుండా. జీవన ప్రమాణాలు ధ్వంసం కాకుండా.. ఆగని కాలంతో పాటు వడివడిగా అడుగులు వేయాలని హితవు పలుకుతూ.. **"నీ నేస్తం"** కవితను రాశారు. తాత్త్వికతతో సాగిన ఈ కవితలో ఆద్యంతం హితోక్తులు దర్శనమిస్తాయి. అలు పెరుగని జీవిత ప్రయాణంలో ఏది చేరువవుతుందో, ఏది దూరమవుతుందో.. తెలియదు. కనుక విధాత నిర్ణయానికి వదిలేసి.. ముందుకు సాగాలని కోరారు. నిను వీడే వారి గురించి వగచకు.. నీ వెంట వచ్చే వాళ్ళని విడువకు అని సలహానిచ్చారు.

నువ్వు ఉన్న ప్రస్తుత క్షణం మాత్రమే శాశ్వతమనీ.. అదే సరైన నేస్తమనీ.. అదే సర్వస్వమని తేల్చి చెప్పారు.

**"కర్కషత్వం"** కవితలో కవయిత్రి శైలజగారు మానవ జన్మ మకుటాయమైనదనీ.. భౌతిక సుఖాల వలయంలో చిక్కకుండా.. బానిస బతుకుకు తావివ్వకుండా మసలుకోవాలని.. కర్కషత్వం దరి చేరకుండా అప్రమత్తంగా ఉండాలన్న అర్థం ధ్వనించే విధంగా కవితను తీర్చిదిద్దారు.

లోకం సమస్తం సాగిలపడే వర్ణ రంజితమైన రసగులిక జీవితమనీ.. క్షణ మాత్రమైనా విలక్షణంగా తీర్చిదిద్దుకోవాలనీ.. ఆటంకాలనే కొండలను పెకిలించి.. అహంకార, మమకారాలను లొంగక ముందుకు సాగాలని హితవు పలుకుతూ **"రసగులిక"** కవితను రూపుదిద్దారు.

**"అమోఘమైన కానుక"** కవితలో కవయిత్రి శైలజగారు అత్యాధునిక సమాజంలో.. సాంకేతికంగా వస్తున్న నేపథ్యంలో.. ఒకప్పుడు తడికట్టెలతో.. పొగచూరిన వంటింటిలో.. గృహిణిగా సేవలందించిన మహిళ.. ఇప్పుడు పొగచూరిన వంటింటి స్థానంలో.. అందమైన పాలరాతితో అపురూపమని పించే ఇంటిరియల్ మాయాజాలంతో సమ్మోహన పరుస్తూ.. కొత్త కొత్త వంటలు చేసి మురిపిస్తుందని పేర్కొన్నారు.

అత్యాధునిక పరికరాలను కానుకగా ఇచ్చి వంటింటి సమాధిలో శాశ్వతంగా భూస్థాపితం చేశారని వ్యాఖ్యానించారు.

**"ఆడజన్మ"** కవితలో ఆడవాళ్ల కష్టాలను అంతరంగాలను.. వారు పడుతున్న కష్టాలను.. అనుభవిస్తున్న వేదనలను ఆర్ద్రంగా ఆవిష్కరించారు. క్షణమొక గండంగా దినమొక యుగంలా.. అనుక్షణం.. అడుగడుగునా ఎదురు చూపులో.. ఈసడింపులో, నిర్బంధింపులో.. పసలేని జీవితాన్ని పేలవంగా నెట్టుకొస్తున్నా.. ఆ బాధల వేదనల నుంచి బయటపడాలనే స్పృహ లేని జడాన్ని..! నిండు పాలకుండ లాంటి హృదయంలో నిరంతరం గరళాన్ని చిలుకరిస్తున్నా.. ఇసుమంతైనా పసికట్టలేని అజ్ఞానం నాది అంటూ గృహిణుల వెతలను ఏకరువు పెట్టారు.

**'గర్భగుడి'** కవితలో.. ఆడతనం అమ్మగా నిండుతనం సంతరించుకున్న అపూర్వ క్షణాలను వివరించారు. మరణపు అంచులను సైతం.. తట్టి వచ్చి సృష్టి అంకుర బీజానికి ప్రాణ ప్రతిష్టను చేసే అమ్మను ఉన్నతంగా ఆవిష్కరించారు. అనివార్యమైన జన్మ అనే కర్మను అద్వితీయంగా సాకారం చేసుకున్న అవతారమూర్తి ఓ అమ్మ అంటూ కొనియాడారు. నీ పోరాట పటిమను అభివర్ణించబూనడం.. సాహసమే సుమా ఈ సకల మానవ జగతికి అంటూ ఈ కవితకు శైలజగారు చక్కని ముగింపునిచ్చారు.

**"విధ్వంసం"** కవితలో.. అమ్మతనంలోని కమ్మదనాన్ని.. తెలియజెప్పారు. ప్రకృతి సమతూకాన్ని పరాభవిస్తూ.. సమాధరించాల్సిన సగభాగాన్ని కాల సర్పంలా కాటువేస్తావు.. భ్రూణ హత్యలపై కవయిత్రి శైలజగారు తమ కలాన్ని ఎక్కుపెడుతూ రాసిన పంక్తులు ఈ కవితలో చక్కగా ఒదిగిపోయాయి.

**"దుస్సాధ్యం"** కవితలో అమ్మయొక్క ఔన్నత్యాన్ని చాటి చెబుతూ.. వెలకట్టలేని అమ్మ సేవలను గుర్తు చేస్తూ.. రాసిన ఈ కవితలో కవయిత్రి ప్రస్తుత సమాజంలో.. కన్నవారు అమ్మను జీవన సంధ్యలో అనాదరణకు గురి చేస్తున్న విషయాలను వివరించారు.

**"అపేక్ష"** కవితలో.. ఆడపిల్లల పట్ల చూపుతున్న వివక్షను తెలియజెప్పారు. ప్రకృతికే నేనంటే పరిహాసమేనంటూ వ్యాఖ్యానించారు. పురుష సంతానంపై చూపే పక్షపాతాన్ని.. ఆడపిల్లల పట్ల చూపే వివక్షతను ఆవిష్కరించారు.

**"అధోగమనం"** కవితలోనూ.. కవయిత్రి శైలజగారు విశ్వాన్ని శాసించే విద్యుత్తును సాధించిన మేధోజీవి ప్రకృతి సహజ ధర్మాన్ని సిగ్గుపడే క్రియగా పెంచి పోషించి సృష్టి అంకుర బీజాన్ని మూడునాళ్ళ ముట్టు పేరుతో మూలన కూర్చోబెట్టినప్పుడే నీ అభివృద్ధిలోని డొల్లతనం తేట తెల్లమైందని వ్యాఖ్యానించారు. ముట్టు కేంద్రాలను మురిపంగా తీర్చి దిద్దుతున్నప్పుడే నీ ఆలోచనలలోని అధోగతి అవగతమైందంటూ కవయిత్రి శైలజ మహిళల వెతలకు అద్దం పట్టారు. ఇది పురోగమనమా? అని ప్రశ్నించారు. ముమ్మాటికీ అధోగమనమే అన్న అర్థం ధ్వనించేలా కవితను తీర్చిదిద్దారు.

**"నెత్తుటి గాయం"** కవితలో ఏ క్షణమైతే నేను నా పెదవులపైకి.. చిరునవ్వుకు ఆహ్వానం పలుకుతానో మరుక్షణమే నేనున్నానంటూ నెత్తుటి గాయాల గతం నన్ను ఆపాదమస్తకం కమ్మేసుకుంటుందని వాపోయారు. సుదీర్ఘ దైనందిన జీవితంలో మరుగున పడ్డట్లే అనిపించిన కరిమబ్బులాంటి చేదు అనుభవాలు అలికిడి లేకుండా ప్రవేశించి ఎలా అలజడులు సృష్టిస్తాయో.. కవయిత్రి శైలజగారు ఈ కవిత ద్వారా తెలియజెప్పారు.

**"సమఉజ్జీ"** కవితలో మహిళగా ఆకాశంలో అర్థభాగంగా న్యాయమైన నా స్థానం లభిస్తే చాలు ఇకనైన అంటూ చెబుతూనే.. ఓర్పు, క్షమ, దయ గుణాల మేలు కలయికనే కాదు నేను గనక కన్నెర్ర చేసి.. సంప్రదాయ సరిహద్దుల పరిదులను అతిక్రమించాలని తలపడితే.. తలపడే వారే లేరు నాతో సమ ఉజ్జీగా అంటూ అతివల పక్షాన స్వాభిమానాన్ని చాటి చెప్పారు.

**"వేట"** కవితలో.. ఆధునిక జనారణ్యమందు వావి వరసలు లేని వికృత చేష్టలకు విలవిలలాడుతున్న విలోమాన్ని నేనంటూ... అతివలు అడుగడుగునా ఎదుర్కొంటున్న అనమానతలను అకృత్యాలను ఏకరువుపెట్టారు. భరోసా ఏది? భద్రత ఎక్కడ? అని ప్రశ్నించారు. నా సహనానికి స్వస్తి చెప్పే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. ఇకనైనా నా స్థానాన్ని సుస్థిరం చేసుకునే వేట మొదలు పెడతాను ఇప్పుడే అని ప్రకటించడం బాగుంది.

**"నిష్కృతి"**, కవితలో అమ్మ యొక్క గొప్పదనాన్ని.. **"వివాహ బంధం"**లో కవితలో వివాహబంధంలోని మహోన్నత తత్వాన్ని, **"అంతర్లీనం'** కవితలో కన్న బిడ్డలు కర్కోటకులై కన్నవారిని వీధుల పాలు చేసే ఘటనలను, ఎదలోని సాదనలను మమతల సుధలతో తాపడం చేస్తేనే కానీ జీవించలేనంటూ **"చీకటి మడుగు"** కవితను, మకిలి పట్టిన మాయా జగత్తు చురకత్తుల దూషణల శర పరంపరల దుర్విమర్శలిక నీ సాన్నిధ్యంలో పూలగుత్తులై విరబూయాలని కాంక్షిస్తూ **"విలంబం"** కవితను, స్త్రీ జాతి మానప్రాణాలకు రక్షణ లేకుండా చేస్తున్న మగ జాతిపై ధ్వజమెత్తుతూ **"చెలగాటం"** కవితను, కార్పొరేట్ శక్తుల మయాజాలంలో విలువలు కొరవడిన విద్యా వ్యవస్థను ఎత్తి చూపుతూ.. **"నిష్పకణం"** కవితను, తీర్చిదిద్దిన కవయిత్రి శైలజ గారు అభినందనీయురాలు.

ఇందలి కవితా వస్తువులను పరిశీలించినప్పుడు మహిళల అస్తిత్వాన్ని కాపాడటం కోసం ఎంపిక చేసుకున్న కవితలే మనకు అడుగడుగునా కనిపిస్తాయి. కవయిత్రి శైలజ మహిళల్లో స్వాభిమానాన్ని నింపే కవితలు దర్శనమిస్తాయి. ఇకనైనా మహిళల పట్ల వివక్షత చూపరాదనీ వారిని నిరాదరణకు గురి చేయవద్దనీ కాంక్షిస్తూ రాసిన కవితలూ ఈ గ్రంథంలో కానవస్తాయి. అంతేగాక.. కవయిత్రి శైలజగారు మహిళల పక్షాన నిలిచి వారి అభ్యున్నతిని ఆకాంక్షిస్తూ రాసిన కవితలూ ఉన్నాయి.

కవయిత్రి వస్తువు ఎంపికలో సింహభాగం మహిళలకే కేటాయించారు. అభివ్యక్తిలో సరళత్వానికి పెద్ద పీట వేస్తూ... మహిళాభ్యుదయాన్ని కాంక్షిస్తూ మహిళల సంవేదనల సమాహారంగా తీర్చిదిద్దారు.

కవయిత్రి శైలజగారు తాను ప్రకటించదలచుకున్న భావాలను.. ఎక్కడా సంక్లిష్టతకు తావివ్వలేదు. అందరికీ అర్థమయ్యేలా భావ ప్రకటన చేశారు. చతురతను ప్రదర్శిస్తూ శిల్పం విషయంలో శ్రద్ధ చూపితే... ఈ కవితలు మరింత గాఢతను సంతరించుకునేవి.. కవయిత్రి శైలజగారు అధ్యయనం ద్వారా... తమ కలానికి పదును పెట్టుకుని మరింత చిక్కని కవిత్వాన్ని ముమ్ముందు మనకు అందించాలని కోరుకుందాం.



- దాస్యం సేనాధిపతి
సెల్:9440525544

## కర్మ జీవి



భూమి తల్లిని నమ్ముకొన్నడు
భూమి తల్లిని వేడుకొన్నడు
భూమి కొరకై పూజజేసెడి
దేశభక్తుడు రైతుగాదే!.

ఆరుగాలము ఆలసింపక
కూడుబెట్టెటి దేవుడెవరయ!
రైతుముందుగ లోకహితుడిగ
కష్టపడేటి కర్మజీవిర!.

స్వార్థ చింతన కొంతయైనను
లేక, మనుషుల జీవనమ్ముకై
అలుపెరుంగక పరిశ్రమించె
అన్నదాతయు మిన్నగాదె!.

రైతు లేనిది రాజ్యమేదని
మాటిమాటికి చెప్పుతుండురు
రైతు కొరకై నేతలెందరు
పాటుపడిరో చెప్పలేము!.

రైతుబిడ్డను పెళ్లియాడుట
ఆడపిల్లలు నిరాకరించె
రైతులేనిది మనములేమని
మనువుజేయుట అవసరమ్ము

ఎద్దు ఏడ్చిన ఎవుసముండదు
రైతు ఏడ్చిన పంటలుండవు
పంటలేకను పసిడి ఎక్కడ
పసిడిరైతును పాటితేవలె!



-సాకి
9951172002

## సమరసత ,శాంతి మార్గం

అరణ్యం ఒక యుద్ధరంగం
ఆకాశంలోని నక్షత్రాలు
అరణ్యంలో ఆయుధాలు
చీకటి యుద్ధ వ్యూహం
దద్దరిల్లినా తుపాకి శబ్దం
ఎగిరెగిరి గూడు వదిలిన పక్షి
చీకటి అంచుల్లో ప్రాణాలు
ఆకాశంలో గర్జనలు
గాలిలో ప్రాణాలు
ప్రాణాలతో చెలగాటం
తూటాల ధైర్యం
ఫిరంగుల మోత
విధ్వంస వికృత హాసం
ఆకాశంలో మిలమిల నక్షత్రాలు
మౌన శాంతి సందేశం.
నిప్పు అంటుకున్న అడవి
చెట్లతో శవాలు మోస్తూ....
కన్నీటి గాలి ఆక్రందన
పొగలతో కమ్మిన మేఘం
విలయతాండవం
ఆగని ఆక్రందనలు
ప్రాణాలు ఎన్నో
పరుగులు ఎన్నో
శిక్షణగా పల్లవించి
మూగబోయిన
అమాయక కంఠాలెన్నో
ఇప్పుడు
ఆకాశంలో యుద్ధం
ఇప్పుడు
మనిషి మనసుల్లో యుద్ధం
పదాల సంఘర్షణ
భావాల సంఘర్షణ
ఆరని జ్వాలల ఆరాటం
భయం లేని మనసులు
దుఃఖిస్తున్న కలం .
శోకం ఆగింది లేదు
కన్నీరు ఆగింది లేదు
ఇప్పుడు సున్నిత భావమే
ఎజెండా
లాగినా ....తెగినా....
లాభమే .....
మనసుల మీద
తెలియకుండానే భావాల స్వారీ
ఆలోచనల మీద దాడి
కనిపించని దాడి
జ్వాలను ఆరనిస్తే ....
మళ్లీ మనుగడ కోసం పోరాటం.
అజ్ఞానంతో జ్ఞానంపై దాడి
జ్ఞాన చేపలు విలవిల
ఉద్రేక కాలం
ఉదయించని జ్ఞాన సూర్యుడు
ఆశల పూదోటలో
వాడుతున్న పూలు
సరిగమల సంగీతం
అశ్రు గీతం సమర గీతం
గ్రహణం పట్టిన జీవితాలు
పూట పూట భయం భయం
కన్నీళ్ల జీవితాలు .
ఎన్నో దిక్కులు నడిచి
ఎన్నో మైళ్ళు దాటి
ఎన్నో సిద్ధాంతాలు
తలపై మోసి
మళ్లీ అదే బాటనడక .
కాలిపోయిన మనసుతో
జీవితం పరుగు.
చీకటి గురించి రాస్తే
చీకటికి కోపం.
వెలుగు కోసమే
నిత్యం అక్షరాలతో పోరాటం
జ్వాలను ఆపడం కోసమే
నిత్యం శాంతి మంత్రం
ఇప్పుడు గెలిచేది
ఒకే నినాదం
విలువైన సమరసత
శాంతి మార్గం



-సిరిసిల్లా గఫూర్ శిక్షక్
9849062038

# కడలి కెరటాలు

(కథ)

-గుండా నరేందర్‌రావు

1996లో రాసిన కథ

నాటి తరం వారి కథలు నేటి తరానికి
**కథల వంతెన**



గుడిసె ముందు పందిరి గుంజకు ఒరిగి కూచుంది మల్లమ్మ. ఆమె చూపులు శూన్యంలోకి నిశ్చలంగా వున్నాయ్. భవిష్యత్తంగా అగమ్య గోచరంఅ అన్నిస్తున్నది. కళ్లలోని నీటిపొర సాయంకాలపు సూర్యకిరణాలకు మెరుస్తోంది.

దీర్ఘంగా నిట్టూరుస్తూ కొంగుతో కన్నీటిని ఒత్తుకున్నది మల్లమ్మ. తన బతుకు తోడుగా వున్న ఎల్లవ్వ కూడా తనను విడిచి వెళ్ళినందుకు ఆమె మనసంతా అల్లకల్లోలంగా వుంది. గోదావరి వరదలా పెల్లుబుకుతున్నది-మల్లమ్మ జ్ఞాపకాల ప్రవాహం.

ఉదయం నుండి ఇంటి పనిలో సతమతమై కాస్త నడుం వాలుద్దామని గోని పట్టా నడింట్లో పరుచుకుంటున్న ఆమెకు 'అంబా' రావం వినిపించింది. బయటకు వచ్చి చూసింది మల్లమ్మ. చిన్నారి లేగ దూడ-మధ్యాహ్నవేళ ఎండకు తాళలేక పోతున్నది. వగరుస్తూ కంచె కు అవతల సోలుతూ తిరుగు తున్నది.

మల్లమ్మ తల్లి మనసు ఒక్క సారిగా ఆర్ద్రమైంది. 'అంబా' అనడం తప్ప ఏమీ చెప్పలేని ఆ మూగ జీవిపై

> **'అవ్వా' బుద్దెరిగిన కాన్నుంచి మమ్ముల గింత పెద్దజేసి మా కాళ్ళమీద మేం నిలబడేటట్టు జేస్తివి. ఇక్కడ ఒక్క దానివే వుండీ ఏం కష్టపడ్తమే.**

ఎక్కడలేని జాలి పుట్టుకొచ్చింది. అనునయంగా తీసుకువచ్చి నీళ్ల పెట్టింది. ఆ లేగ దూడకు అదిగో ఆనాటి నుండి దానికోసం ఎవరూ రాలేదు. అది మలమ్మను వీడి పోలేదు.

ఆ విధంగా ప్రవేశించింది మల్లమ్మ జీవితలోకి ఆ లేగ దూడ. దానికి ముద్దుగా ఎల్లమ్మ దేవత పేరు పెట్టి, తన పిల్లలతో పాటుగా పెంచుతూ వచ్చింది.

కానీ, ఈనాటికి, దానికి, మల్లమ్మకు ఎడబాటు కాలం వచ్చింది. ఇంటాయన కాలం చేసిన దగ్గర నుండి చేతికి అంది వస్తున్న పిల్లలు కూలీనాలీ చేసుకుంటూ పెద్దజేసింది. ఎదిగిన పిల్లలు ఎవరికి వారు బ్రతుకు తెరువు వెతుక్కొంటూ బస్తీలు పట్టిపోయారు.

అప్పటి నుండి ఎల్లవ్వే తోడైంది మల్లమ్మకు. వారం క్రితం చిన్న కొడుకు వచ్చి..'అవ్వా, నువ్వు నాతోటి రావాల్నే నాకు బొగ్గు బాయిల్ల పని దొరికింది. అందరం అక్కన్నే కలిసి బతుకుదాం' అన్నాడు. ఏం చెప్పాలో అర్థం కాలేదు మల్లమ్మకు.

ఇంటాయనతో కాపురానికి వచ్చినప్పటి నుండి వూరు విడిచి ఎరుగదు. ఆయన పోయినా ఆయనొదిలిన ఇంట్లోనే వుంటూ పిల్లల్ని సాదింది. తెలివిచెప్పింది. పెద్దజేసింది.

రెక్కలొచ్చి పిల్లలు ఎగిరిపోయినా, రెక్కలుడిగిన తను ఎల్లవ్వ తోడుగా యింత కాలం గడిపింది.

ఇక్కడ వూరునే వది రమ్మంటున్నాడు- కొడుకు. తనతో నిమిత్తం లేకుండా బయలుదేరదీశాడు. ఇంటిని ఎవరికైన అమ్మేస్తానన్నాడు. ఎల్లవ్వ ముసలిదైపోయింది. ఏ కసాయి వాడికైనా యిచ్చేస్తానన్నాడు.

ఆ మాటలు వింటున్నపుడు మల్లమ్మ గుండెల్లో గునపం దింపినట్లు విలవిల్లాంది.

'అవ్వా' బుద్దెరిగిన కాన్నుంచి మమ్ముల గింత పెద్దజేసి మా కాళ్ళమీద మేం నిలబడేటట్టు జేస్తివి. ఇక్కడ ఒక్క దానివే వుండీ ఏం కష్టపడ్తమే. కాలు నొచ్చిన, కడుపు నొచ్చిన సూసెటోల్లెవరు. నాతోని వస్తె సుకంగా కాలుమీద కాలేసుకొని, మనుమలతో ఆడుకుంట కాలం ఎల్లదీత్తువు. గిప్పుడు కాకుంటె నిన్నింకెపుడు సుక పెడ్తమే. నీ కడుపుల పుట్టినందుకు మమ్ముల గీయింతనన్న పున్యం కట్టుకోనియ్యే' అని బతిమిలాడాడు.

ఏం మాట్లాడడానికి పాలుపోలేదు మల్లమ్మకు, నిజమే కొడుకులు బస్తీలల్లో బాగానే బతుకుతున్నారు. కోడళ్లతో, మనుమలతో, మనుమరాళ్ళతో సుఖంగానే వుండవచ్చు.

కానీ...

ఈవూరును, ఇల్లును, ఎల్లవ్వను వదిలి తానుండ గలదా?

చిన్న కొడుకు పుట్టినప్పుడు పాలు లేకపోతే తన పాలతో కొడుకును బతికించిన ఎల్లవ్వను ఏమి చేస్తుంది?

ఎలా..? ఏం చేయాలి..??

మునసబుకు యిల్లు అమ్మినట్లు కాగితాలు పట్టుకొచ్చాడు-కొడుకు. వస్తూ వస్తూ కసాయిని కూడా వెంటపెట్టుకొచ్చాడు.

చలనం కలిగింది మల్లమ్మలో..

'నాయనా! దాన్ని మనం తీసుకు పోదాంరా, లేకపోతే ఎవలకన్న వట్టిగనే యిచ్చేయ్యరా, నిన్ను సాదింది అదేరా, దాని పాలు తాగేరా నువు గింత పెద్దోనివైనావ్. అంటూంటే మల్లమ్మ కళ్లనుండి గంగ ధారాపాతంగా కారింది.

'ముసల్దాన్ని ఎవడు కొంటడే- గీ కసాయి కాబట్టి ఎంతో కొంత యిత్తనుంటండు..' అంటూ ఎల్లవ్వకు కట్టిన తలుగు చివరను కసాయి కందించాడు.

ముసలిదయిన ఎల్లవ్వను కసాయి వాడికి అప్పగిస్తున్న కొడుకు మల్లమ్మకు బ్రహ్మ రాక్షసునిగా కనబడ్డాడు. తన నేస్తం-పాలిచ్చి పెంచిన నోరులేని మూగ జీవమది. జీవితంలో భాగంగా, తోడుగా నిలిచిన ఎల్లవ్వను కసాయి వాడికి అప్పగించడం-పల్లెపట్టులోని సజీవ స్రవంతి నుండి కరుకుదనమే గాని కరుణ రసం తెలియని కాంక్రీటు సమాజంలోకి కొడుకు తనను తీసుకెల్లడంలో-తేడా కన్పించలేదు మల్లమ్మకు.

'అంబా' అంటూ కసాయి వెంట వెళ్ళనని మొరాయిస్తున్న ఎల్లవ్వను చూస్తూ కడుపులో పేగులు కదిలి కదిలి ఏడ్చింది మల్లమ్మ నిస్సహాయంగా.

'నన్ను సెమించాలె ఎల్లవ్వ. గింత కాలం నా ఒంట్లె బలమున్నది. నిన్ను సాదిన, ఇప్పుడు నేనే యింకోనికి బరువుగ పోతన్న. ఎడబాటు కాలమచ్చింది. నిన్నెట్లతీస్కుపోవాలె' తన మనసుతోనే క్షమించమని వేడుకున్నది మల్లమ్మ.

> **మల్లమ్మ తల్లి మనసు ఒక్క సారిగా ఆర్ద్రమైంది. 'అంబా' అనడం తప్ప ఏమీ చెప్పలేని ఆ మూగ జీవిపై ఎక్కడలేని జాలి పుట్టుకొచ్చింది.**

మనసంతా ఏదోలా వుంది-చేదు తిన్నట్లుగా. జీవచ్ఛవంలా కదులుతోంది గడిసెలోనుండి చిన్న మూటను తీసుకుని బయటకు వచ్చింది.

సూర్యుడు పశ్చిమాద్రిన క్రుంగిపోతున్నాడు. మల్లమ్మ మనసు దిగులుతో భారంగా తయారయ్యింది.

సాయం కిరణాలు మల్లమ్మ పాదాలను తడుతున్నాయి-వీడ్కోలు యిస్తున్నట్టుగా. నీడ దీనంగా సాగిలబడింది.

గుడిసె చుట్టూ ఒక్కసారి తిరిగి వచ్చింది.

కడుపులో నుండి దుఃఖం లావాలా తన్నుకొచ్చింది. మల్లమ్మకు. పొరలు పొరలుగా చూపును కమ్మేస్తున్నాయి కన్నీళ్ళు.

'అంబా' అంటూ ఎల్లవ్వ. పిలుపు మల్లమ్మ కాళ్ళకు బంధం వేసింది. ఆపదలో 'అమ్మా' అని పిలిచే బిడ్డ గుర్తు కొచ్చాడు- మల్లమకు.

మెడలో సగం తెగిన తలుగులో పరుగెత్తుతూ వస్తూంది-ఎల్లవ్వ.

దిగులంతా వెలుగై పరవళ్ళు తొక్కిన మనసుతో ఎదురుగా వెళ్ళి ఆప్యాయంగా దాని మెడను కౌగిలించుకుంది-మల్లమ్మ.

దూరం నుండి పరుగు పరుగున తనదైన భాషలో మాట్లాడుకుంటూ వస్తున్నాడు కసాయి.

అవ్వా! పొద్దుపోతంది, నడువే, బస్సుదొరకది' అంటున్నాడు మల్లమ్మ చిన్న కొడుకు.

నాలుకతో మల్లమ్మ చేతులను సున్నితంగా నాకుతున్నది- ఎల్లవ్వ.

దాని కన్నీటి చారలను వణుకుతున్న చేతులతో తుడుస్తున్నది-మల్లమ్మ.

*(జ్వలిత సంపాదకత్వంలో వెలువడిన "ఖమ్మం కథలు" నుండి...)*

పుస్తక సమీక్షలు

# "మీది తెనాలి మాది తెనాలి" కామెడీ కథలు





-ప్రతులకు:
ఆర్ సి కృష్ణ స్వామి రాజు
బ్యాంక్ ఎంప్లాయిస్ కాలనీ ,
అక్కారంపల్లి
తిరుపతి517507
చరవాణి:9393662821

ఆర్ సి కృష్ణ స్వామి రాజు గారి కలం నుండి జాలువారిన మరో కథల సంకలనం "మీది తెనాలి మాది తెనాలి "ఇది కొసమెరుపులతో కూడిన కామెడీ కథలు. ఈ కథలు పాఠక ప్రియులను కడుపుబ్బ నవ్వించకపోయినా నవ్వించడం మాత్రం ముమ్మాటికి వాస్తవం. ఆర్ సి కె రాజుగారు రాసినటువంటి ఈ కథల సంకలనంలో మొత్తం 20 కథలు చాలా బాగున్నాయి ఒక్కో కథకు సంబంధించి శీర్షిక ఒక్కో రకంగా వైవిధ్యభరతంగా ఉన్నాయి.

**"కళ్యాణ కట్ట"** మొదలుకొని **"బంగారు చెట్టు "** వరకు ఆసక్తికరంగా చదివించే కథలుగా మలిచినారు రాజుగారు. ఇదే ఆయన ప్రత్యేకత .

"మీది తెనాలి మాది తెనాలి" కథలో సౌండ్ స్లీప్ కి అసలైన అర్థాన్ని తెలియజేయడం బాగుంది. అంటే **"గురక'** పెట్టి నిద్రపోవడం. ఈ కథలో చిన్న విషయాలు పెద్దవి చేస్తే సంసారంలో సమస్యలు వస్తాయనే సందేశాన్ని ఈ కథలో రచయిత చెప్పకనే చెప్పాడు. చివరకు విడిపోదామనుకున్న దంపతులిద్దరూ మీది తెనాలి మాది తెనాలి అని నవ్వుకున్నారు. కథ చాలా బాగుంది.

మరొక కథ "కళ్యాణ కట్ట ". కాబోయే అల్లుడిని, అత్త అంచనా వేయడం, తిరుపతి లో గుండు కొట్టించుకోవడం, ఇలా అర్థం చేసుకున్నటువంటి అల్లుడే తనకు కావాలనుకోవడం రచయిత కథను చాలా చక్కగా మలిచినాడు. కథ చాలా నవ్విస్తుంది.

"చత్రపతి" కథలో హీరో దగ్గర పని చేసే రాజశేఖర్ సొంత గ్రామానికి వస్తే ,అందరూ ప్రేమ ఆప్యాయత ఒలకపోస్తూ జై జైలు పలకడం రాజశేఖర్ కు చాలా సంతోషాన్ని కలిగిస్తుంది . అతడిని ప్రజలందరూ ఊరేగింపుగా తీసుకెళ్లడం పూల వర్షం కురిపించడం లాంటివి దండలు వేయడం రాజశేఖర్ కు ఆనందాన్నీ ఇచ్చాయి .ఇంకా తదుపరి కథ తెలుసుకోవాలనుకుంటే కథను చదవాల్సిందే.

ఇలా ప్రతి ఒక్క కథ ఒక ప్రత్యేకతను కలిగి ఉండి హాస్యాన్ని చక్కటి సందేశాన్ని అందించినవిగా చెప్పవచ్చు .ప్రతి ఒక కథ సమకాలీన సంఘటనలకు అనుగుణంగా ఉన్నట్టు . పాఠక ప్రియులను అలరిస్తుంది. ఇలాంటి కథలు మరెన్నో రచయిత రాయాలని ఆశిద్దాం.

ఈ సంపుటిలో ఉన్నటువంటి కథలే కాదు ఈయన రాసిన ఇతర సంపుటాలను పరిశీలిస్తే ఈ ప్రత్యేకతను స్పష్టంగా తెలుస్తాయి ఎవర్ని అనుకరించకుండా తనదైన శైలిలో కృష్ణస్వామి రాజుగారు చాలా చక్కగా ఈ కథలను సాహిత్య ప్రియులకు అందించారు

ఈ కథలన్నింటిలో రచయిత గారు మాండలికంతో కూడినటువంటి పదాలను ఉపయోగించాడు. తెలంగాణ ప్రాంత వాసిగా కొన్ని పదాలు నాకు అర్థం కాకపోయినా అర్థం చేసుకునే ప్రయత్నం చేశాను. టమాటోలను "తక్కాళి పండ్లుగా కొత్త అర్థంగా తెలుసుకున్నాను. ఆర్ సి కె రాజుగారు తన బాల్యం నుండి పుట్టి పెరిగిన పల్లెటూరి వాతావరణం లాగా ప్రతి కథను చక్కగా తీర్చి దిద్దినారనిపిస్తుంది. ప్రతి కథలోని పాత్రలను పేర్లను కూడా మన ఇరుగుపొరుగు వారేమోననిపిస్తుంది. రచయిత ఏలాంటి విసుగు లేకుండా పాఠక ప్రియులను చదివించే ప్రయత్నం చేశాడు అనడంలో ఎంత మాత్రం అతిశయోక్తి లేదనిపిస్తుంది . కథను చదువుతున్న కొద్దీ ఇంకా తదుపరి విషయాన్ని తెలుసుకోవాలని ఆసక్తి కలుగుతుంది. అంతేకాకుండా సామెతలను కూడా రచయిత ఈ కథలలో వాడడం జరిగింది. ఇలాంటి కథలు ఎన్నో ఆర్సీ కృష్ణస్వామి రాజు గారి కలం నుండి జాలువారాలని కోరుకుంటూ అభినందనలు...



-యాదవరం
చంద్రకాంత్ గౌడ్
9441762105

# కోహినూర్-కథ-కమామీషు







ప్రతులకు:
డా॥జెల్ది విద్యాధర్
సెల్:9490469606

**"వేవేల నక్షత్రాలతో నిండి హృదయాకాశం వజ్రమై మెరి సింది... కాంతితో కలసి శాంతి కూడా మనసులో శాశ్వతంగా చేరింది"**

అంటూ కవిత్వీకరించిన కవి జెల్ది విద్యాధరరావుగారు.

నీవొక తెరచిన పుస్తకమే తెరిపిలేని సదాశయాల మస్తకమే అంటూ పుస్తకాన్ని మస్తకానికెత్తుకుని పుస్తకాన్ని వజ్రం, అందులో కోహినూర్ వజ్రంతో పోల్చడం వారికే చెల్లింది. **"వాక్యం రసాత్మకం కావ్యం"** అన్న విశ్వనాథుని నిర్వచనానికి సరిపోల్చదగినది ఈ కోహినూర్.

గుంటూరు ఏసీ కాలేజీలో చదివిన విద్యాధర్ గారు యం. బి.ఏ. ఇదే కాకుండా ఎకనామిక్స్‌లో పిహెచ్. డి. చేసిన కవి.

వృత్తిరీత్యా ఆల్ ఇండియా సర్వీసెస్‌లో ఉన్నతాధికారి. ప్రవృత్తి సృజనాత్మకత. ఈ రెండింటిలో వీరు రాణించడానికి అండగా నిలిచే వారి జీవిత భాగస్వామి విజయ సౌభాగ్య జ్యోతి-ఆనందం, ఆత్మీయత కలగలసిన కుటుంబం వీరిది.

పేరులోనే విద్యను నింపుకున్న విద్యాధర్ గారు నిజంగా ప్రతిభాశాలి. గుంటూరులో ఉండగా, రాసిన కవిత్వాల గురువుల బోధ నలతో, పుస్తకాల పఠనంతో అంచెలంచెలుగా పెరిగి అత్యుత్తమ కవిత్వ సృజన చేయగలిగే శక్తిగా వారు ఎదిగారు.

ఇప్పటికే రెండు పుస్తకాలు వచన కవిత్వాన్ని వెలువరించి, మూడవ పుస్తకంగా "కోహినూర్" పేరుతో మూడవ కవితా సంపుటిని మన ముందు ఉంచారు. అంతరంగపు భాషతో, తోటమాలి మాలిమితో కోహినూరు వజ్రాన్ని బయటకు తీశారు.

ఈ కవితా సంపుటి ముఖచిత్రం చూడగానే ధ్యానం చేస్తున్న ఒక అపూర్వ చిత్రమూర్తి వజ్రాన్ని చేతుల్లో పట్టుకున్నట్లు కనిపిస్తుంది. ఆ కోహినూరు వజ్రకాంతి దగద్ధగా యమానమవుతూ అన్ని దిశలనూ ప్రకాశవంతం చేస్తుంది. కోహినూర్ అనేది ఇక్కడ జ్ఞానం అనుకుంటున్నాను నేను. జ్ఞానం కోహినూరు వజ్రమై మనలను ఎంతో కాంతిమం తమైన మస్తిష్కం కలగాలిగా చేస్తుందని నేను ఆ భావనతో అర్థం చేసుకున్నాను. ఆ పుస్తకాన్ని స్పృశించగానే ఒక అనూహ్యమైన స్పందన కలిగింది. అది ఒక ఆధ్యాత్మికం కావచ్చు. ఒక అలౌకికానందం కావచ్చు. ఉల్లాసభరి తమైన, ఉద్విగ్నమైన భావన కావచ్చు.

ఇలాంటి ముఖచిత్రం, తరువాత కవితా శీర్షికలు చూడగా, మొదట **"నీకోసం వస్తాను"** అనే దానితో మొదలై, **"సముద్ర భాష"** అనే కవితతో ముగించడం జరిగింది. మొత్తం 63 కవితలున్నాయి.

నీకోసం ఎదురు చూస్తుంటాననే మాటకు బదులుగా

**"ఆ సమయం కోసం నేను వేచి ఉన్నానన్న నీ పలుకు**
**కాలుతున్న నేలపై తొలకరి చినుకై మది పులకరించింది"**

అన్న కవితా వాక్యాలతో కవి భామంబర వీధి విలాసం దొరికింది.

కవి మదిలో పొంగిపొర్లే భావాలకు పదవిన్యాసాల చాతుర్యం, అంత్యానుప్రాసల అల్లికలు తోడై వీరి కవిత్వం ఆహా! అనిపించకమానదు.

పాము పామే కవితలో చివరలో **"ఓ పామా! మనుషులపై అంత కోపమా! నిన్ను మించిన విష పురుగులని అసూయా ద్వేషమా!"** అన్న రెండు పాదాల్లో మనిషి స్వభావాన్ని చిత్రికపట్టారు.

ఘనీభవించిన లోయలో **"సమస్త విశ్వానికి విశ్వాసమే మూలమనీ, అచంచల అలౌకిక ప్రేమ మాత్రమే లోకాన్ని మార్చగలదని, సమానత్వం, మానవత్వం శీతగాలులనీ, మహితాత్ముల పలుకుకు ప్రతిధ్వనించే లోయ ఇది"** అని నిర్వచించారు.

బాటసారి ఏవో ఆశలతో బయలుదేరాడు అతనికి ప్రకృతి అంతా సహకరించాలని కవి వేడుకుంటున్నాడు.

**"నిత్యకృత్యంలా మారే జీవిత పరీక్షలలో పరాజయునికి**
**నిర్నిమేషంగా నీ అమృత జలం నిస్త్రాణ సంచారివై జల్లనీ!"**అంటారు.

భూమి, నీరు, గాలి, పంచభూతాత్మకమైన ప్రకృతిని అతనికి బాసటగా నిల్వమంటున్నాడు కవి.

**"ఓ సత్యమా! నీవెక్కడ?**
**---**
**ఒకసారి నీతో మాట్లాడాలని ఉంది.**
**అటు, ఇటు, ఎటు వెతికినా కనిపించవేం!**
**మూడు దశాబ్దాల క్రితం గతించిన**
**మా అమ్మమ్మతో వెళ్ళిపోయావా!"**

అని వాపోతాడు. నిజంగా ఈనాడు సత్యవంతులను వెతుక్కోవాల్సిన పరిస్థితి. సత్యం ఎక్కడుందో భూతద్దం పెట్టి వెతకాల్సిన పరిస్థితి.

**"ఏది నిజం ఏది అబద్ధం"** అని తెలియని అయోమయ స్థితి. చక్కగా తెలియజేశారు.

**"వొంగి కుంగిన భుజంపై నీ చేయి వేసినప్పుడు ఓడిన జీవన రథాన్ని పాతాళం ఊభి నుండి పైకి లేపొచ్చని గురి కుదిరింది"** అంటారు.

"బ్రతుకు సువాసన కవితలో. ఓడిపోయాం అనుకున్న క్షణంలో ఒక్క విజయం, బతుకు భరోసానిస్తుంది. అలాంటప్పుడు బతుకు సువాసన తెలుస్తుంది. ఇలా సామాజిక కోణంలో ఎన్నో కవితలు మనసుకు హత్తుకునేలా రాసారు విద్యాధర్ గారు.

మంచి కవిత మరొకటి **"జంట సరోవరాలు".** రెండు కనులు, రెండు సరోవరాలు, అవి రెండు జలాశయాలు అంటారు.

**"సుప్రభాత వేళలో ప్రతిదినం దేవేరికి నిత్య స్తోత్రం పఠిస్తూ అర్చకుడిలా మారి అభిషేక హారతి కళ్ళకు పడుతుండాలి."**

నిజంగా కళ్ళు ఎన్నో భావాలను కురిపిస్తాయి. ప్రేమ, తిరస్కారం, ఎడబాటు, ఆవేదన, ఆక్రోశం, ఉల్లాసం, సంతోషం ఇలా... ఏ భావం అధికంగా కలిగినా కళ్ళనీళ్ళొస్తాయి.

అందువలన 'జంట సరోవరాలు' అనే శీర్షిక పెట్టి ఉండవచ్చు. 'నిరంతర తంతు" ఇదో అద్భుతమైన భావస్ఫోకంమైన కవిత.

ఒక ప్రియుడు లేదా భర్త, ప్రియురాలు లేదా భార్యతో - అంటున్న మాటలు... ఇవి అన్నీ చదివి తెలుసుకుని అనుభూతి చెందవలసిందే. ఎలాగైనా ప్రేయసిని చేరతానని చెప్తాడు ప్రియుడు.

ఇది చదువుతుంటే, నాకు దాశరథి గారి గజల్ గుర్తొచ్చింది. **రమ్మంటే చాలుగానీ రాజ్యాలు విడచిరానా నీ చిన్న నవ్వుకోసం స్వర్గాలు గడిచి రానా"** అనేది.

ఇక్కడ **"జవరాలి హృదయ సంచారమే కదా బ్రతుకులోన గెలుపు"** అంటారు.

ఈ సంపుటిలో అధికభాగం కృష్ణ శాస్త్రి వలె భావ కవిత్వం కవితలు ఎక్కువ భాగం ఉన్నాయి.

విద్యాధర్‌గారు **'గజల్'** సాహిత్యాన్ని ఎక్కువగా సృజించగలరేమో అనిపిస్తుంది. ఆ ప్రయత్నం చేయలేదు కానీ, అదే గనుక చేస్తే గొప్ప గజల్ కవి కావలసినంత భావనా బలం ఉన్నది ఈ కవికి.

**"జంట వీడని పక్షులు"** కవితలో మనసు మంచం మీద దుప్పటి దులిపాను, కొన్ని పరిమళాలు చిలుకల్లా పైకి ఎగిరాయి. నీ అనుభూతి జ్ఞాపకాలు గుప్పెడు ముత్యాల్లా జారి ఇల్లంతా అల్లరిగా దొర్లుకుంటూ పోయాయి".

**"పరిమళాల చిలుకలు ఎగరటం'** జ్ఞాపకాలు ముత్యాలు ఇల్లంతా దొర్లడం, కాల్పనిక సాహిత్యాన్ని మథించిన వారికే ఈ ఊహలు సాధ్యం అని నేననుకుంటాను నిరంతర పఠనశీలి విద్యాధర్ గారు అని.

ఇలా చెప్పుకోవాలంటే చాలా కవితలు ఉన్నాయి. **"కోహినూర్"** పుస్తకం శీర్షిక కవిత మీరు చదివి అనుభూతి చెందవలసిందే. **"వ్యక్తిత్వమే నీ అస్తిత్వం"**, అజంతాలో లేనిది, చీకటి గదులు, ఇలా చాలా కవితలు ఉన్నాయి ఇందులో. **"భావ ప్రతీకలతోట"** పదచిత్రాలతో, అంత్య ప్రాసలతో, కొండలపై నుండి ఉధృతంగా సాగే శైలీ ప్రవాహంతో **"కోహినూర్"** కవితా సంపుటి పాఠకుల హృదయాలను చూరగొంటుందని చెప్పడానికి ఏ సందేహమూ లేదు.

అభినందనలతో...



-డా॥ గడ్డం శ్యామల
9704175183

# వచన కవితలు



-డా॥రావి రంగారావు
9247581825

పేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో డా. రావి రంగారావు 2024 నుండి నిరంతరాయంగా నిర్వహిస్తున్న వారం వారం కవితల వర్క్ షాపులు.

2025 "వారం వారం కవితల వర్క్ షాప్" 27 అంశం "దోపిడి". మొత్తం 27 మంది కవులు తమ కవితలు పోస్ట్ చేశారు. 4 కవితలకు ప్రశంసా పత్రాలు లభించాయి.

## దోపిడి

దోపిడి దోపిడి దోపిడి
దొరల ముసుగున
దోపిడి దొంగలు
బరితెగించి దోపిడి...
గ్రీష్మ తాపానికి నెర్రెలిచ్చి
దాహంతో అలమటిస్తూనే
కళ్ళల్లో వత్తులేసుకుని
తొలకరికై ఎదురుచూసే ధరణికి
గొంతు తడుపుకొన
చుక్కనీరైనా ఇంకనీక
మార్జిన్లు సైతం వదలక
సిమెంటు రోడ్లతో
జలసిరుల దోపిడి...
తొలకరి గిలిగింతలెడుతూ
మేను తాకినంతనే
పచ్చదనాల కోక కట్టి
ఏటికి మూడు పంటలతో
ముప్పొద్దుల కడుపు నింపు
మేలిమి బంగారు భూములను
రియల్ ఎస్టేట్ పేరిట
ధరణి సిరి దోపిడి...
వన దేవత ఒడిలోన
తుళ్ళుతూ గెంతుతూ
పర్యావరణ సమతౌల్యాన్ని
కాపాడే వన్యప్రాణుల
గృహాలను సైతం ఆక్రమించి
వన సిరి దోపిడి...
అవని గర్భాన దాగిన
అపార ఖనిజ సంపదపై
అత్యాశపరులు కన్ను వేసి
ధరణి మాత గర్భానికి
పాతాళం లోతున
తడి ఆరని గాయలు చేస్తూ
పసిడి వనరుల దోపిడి...
దొరల ముసుగు నున్న
దోపిడి దొంగల పీచమణచగా
ఓ దేవాదిదేవా, వేగమే రావా,
అంటూ రోదిస్తూ ధరణి...

-సంబరాజు రమణి

## దోపిడీ లోకం

ఇప్పుడు
దోపిడి లేని లోకం అంటే
ఆకలి మర్చిపోయిన మనిషి జీవితం,
అంతా దోపిడే...
జన్మ నిచ్చే ఓపిక లేని అమ్మలను
కత్తెర వైద్యం దోపిడీ చేసేస్తోంది,
పాలిచ్చే పాశం మరచిన పెంపకాన్ని
కల్తీ పాలడబ్బాల
అందం దోచేస్తోంది...
చదువు నిచ్చే నిలయాలు...
చదువుని కొనే
వలయాలుగా దోచేస్తున్నాయి,
విజ్ఞానం ఇవ్వాల్సిన విద్య
ర్యాంకుల మాయలో దోచేస్తుంది...
సంస్కారం నేర్పాల్సిన సంఘం
డ్రగ్స్, జూదం పేరిట యువతని
దోచేస్తుంది,
బంధాన్ని ఇవ్వాల్సిన వివాహం
కట్నం పేరిట లేత
ఆశల్ని దోచేస్తుంది...
బ్రతుకు పంచుకోవాల్సిన కుటుంబం
పిల్లల్ని విదేశాలకు పంపేసి
స్వదేశపు సొమ్మును దోపిడీ
చేసేస్తోంది...
నేరం...
అధికారంగా ప్రమోషన్ తీసుకుని...
రాయి నుండి
ఆకాశంవరకు దోచేస్తుంది,
న్యాయం డబ్బుల కట్టలుగా మారి...
నిజాలను పెన్నుతో దోచేస్తుంది.
మనిషికి
చివరి చోటు కూడా మిగలకుండా...
స్మశానాల్ని రియల్ ఎస్టేట్లుగా
దోచేస్తున్నారు,
ఇప్పుడందరికీ దోపిడీ వృత్తి
ప్రపంచం
వనరులను దోచుకోవాలని,
దేశాలు అధికారాల్ని దోచుకోవాలని,
ప్రభుత్వాలు
అవకాశాలను దోచుకోవాలని,
ప్రజలు రేపటిని దోచుకోవాలని...
అంతా
దోపిడీ
లోకాన్ని సృష్టించుకుంటున్నాము!
చివరికి...
మనల్ని మనమే దోచుకునే...
సరికొత్త
దౌర్భాగ్యాన్ని నిర్మించుకుంటున్నాము!

-శ్రీఅరుణంశ్రీనివాస్

## దోపిడి

ఇది ముసుగు దొంగలు చేసే
మాములు దోపిడీ కాదు.
వ్యవస్థల ముసుగు వెనుక ప్రజా
ధనపు
ధర్మ కర్తల మంటూ
దొరలు చేసే నిలువు దోపిడీ .
ఇవి అమావాస్య
చీకటి మాటున
ఒంటికి ఆముదం పట్టించి
చోరాగ్రేసరులు చేసే
చిల్లర దొంగతనాలు కావు,
పట్టపగలు, నిండువెలుగులో
తెల్ల కోట్లు, నల్లసూట్లు,
పొడుగు బూట్లు, వగైరాలు
దర్జాగా చేసే ప్రజాదోపిడీ...
ఏ డ్రెస్ కోడ్ కి తగ్గట్లు
ఆ టైప్ లో ,
ఆ ఆ స్థాయిల్లో
దోపిడీ ఉంటుంది..
జనాన్ని దోచేయడం లో
ఒక్కొక్క రంగు డ్రెస్ దీ
ఒక్కొక్క "మెథడాలజీ"
"బ్లేడ్ బాబ్జీ" లు చేసే
చిన్న చిన్న జేబు
కటింగులు ఒక రకం..
"రాజనాల" లాగా
జనాలను ఏమార్చి
కొట్టేసే నల్ల సూట్ కేసులు
మరో రకం.
బొక్కసానికి వేసిన
చిన్న కన్నంతో
సరి పెట్టుకోవడం కాకుండా
"తిరుడా తిరుడా" లో లాగా
మొత్తం బొక్కసాన్నే
లేపేయడం ..
ఇదో సరికొత్త రకం దోపిడీ..
మట్టిలో పుట్టి,
మట్టి తోమమేకమై,
మట్టిలో బ్రతికే
ఎండిన కడుపులకు
మట్టిని తినడం మాత్రం
తెలియలేదు .
కానీ ..
ఇక్కడ
మట్టిని తిని,
కొండలను మింగేసి
బండలను నమిలి వేసే
ఇంద్రజాలికులున్నారు.
దొంగలను వెంటాడే
సినిమా పోలీసుల్లాగా,
ప్రశ్నించే "విజిల్ బ్లోవర్స్"
అక్కడక్కడా కనిపిస్తారు..
కానీ
వారి ఈలలు తుప్పు పట్టి
సరిగా మోగడం లేదు?
అందులో పక్కనే
రణ గొణ శబ్దాలతో
ఊదర గొడుతున్న
పెద్ద పెద్ద బాకాలు!.
ఈ బాకాల మోతల్లో,
ప్రశ్నించే గొంతుల్ని
వినిపించుకొనే
నాధుడే లేడు!.

-శ్రీనివాస శాస్త్రి

## దోపిడీ

దోపిడీ దోపిడీ
నీ శ్రమ దోపిడి
శీలం దోపిడి
గౌరవం దోపిడి
హక్కులు దోపిడి.
ఓ కార్మికుడా
నీ సర్వం దోపిడి
సంపద సృష్టించే నీకు
మిగిలేది ఎంగిలి విస్తరాకు!.
వ్యాపారం అంటోంది
నా ఆలోచనే
మీకు భుక్తి నిస్తోందని!
కానీ శ్రామికా..
తెలీదా..
నీ శ్రమే వాడికి
భవంతి నిస్తుంది!
నీ చేమటే వాడి
హిమోగ్లోబిన్ పెంచుతుంది!.
ఎక్కడుంది న్యాయం!
ఆలోచనకు ఆనపకాయంత
శ్రమకి శెనగ కాయంత
రాబడా!
ఎందుకింత వ్యత్యాసం!.
దోపిడీ దోపిడీ..
శ్రామికులకు దోపిడి
రాబందులకు రాబడి.
సేవ చేసే బంటు
రాజ్యాన్ని కాపాడే యోధుడు
నిత్యం శ్రమతో పోరాడే
ఆయుధ జీవివి నీవు
కానీ
రాజుని నిర్ణయించే
పోరాటంలో
దశాబ్దాలుగా వ్యాపారులు..
కార్పొరేట్ బడా బాబులుకన్నా
వెనుకబడ్డావు

-రాజ్ తొర్లపాటి

## అంశం: "వాళ్ళకు శిక్షలు పడవు"

సమతా మమతల విలువ తెలుసుకొని
స్వార్థం బ్రతుకులు తెగ నరికి
ఐకమత్యంతో మెదిలే వాడికి
శిక్షలు పడవు...
పరిమళింపు సౌజన్యం
వాడే కాబట్టి !.
నాకెందుకు నాకేంటి అనుకోకుండా
పరోపకారమే పరమతత్వమని
ప్రేమ తత్వాన్ని పంచేవాడికి
శిక్షలు పడవు...
నా అనే స్వార్థం
వదిలేశాడు కాబట్టి !.
ఉరకలు తొక్కి ప్రవహించే
మనసు కోరికల గుట్టలో
మలినాలను వెతికి తీసి
శాంతి కరుణను కాచే వాడికి
శిక్షలు పడవు...
మనిషే దైవమని
గ్రహించాడు కాబట్టి !.
సుగుణాలు వెదజల్లే
నవ్వుల జల "తార"లతో
పచ్చ పచ్చని చిగురులు వేసి
ప్రాణ కోటికి పంచేవాడికి
శిక్షలు పడవు...
జ్ఞాన సంపదను
వెదజల్లుతాడు కాబట్టి! .
సరిహద్దులో శాంతి కొరకు
తొలి పొద్దులా తపియించి
కర్తవ్య దీక్షలో నిద్రించని సూర్యులకు
శిక్షలు పడవు...
అమరత్వాన్ని
సాధించాడు కాబట్టి !.
శిఖరాలను మించిన
సుగుణాలను పోగేసి
గాఢాంధకారాన్ని తరిమేసిన
విజ్ఞాన జ్యోతులకు
శిక్షలు పడవు...
ధర్మ ధీరులై
కదులుతారు కాబట్టి! .

-సత్యవతి
(కరాలపాడు,

## శిక్షలు పడవుగా!.

దేశ భక్తి ఎరవేసి
పేదల భూములు లాగేసి
రాజ ప్రాసాదాల్లో
సేదదీరుతున్న నేతలు,
ఎండకు ఎండుతూ
వానకు తడుస్తూ
ఫుట్పాత్ పై పేదలు...
అధికార మంత్రదండాన్ని
అడ్డుపెట్టుకున్న నాయకులకు
శిక్షలు పడవుగా!.
ఎన్నికల ముందు ఇచ్చిన
హరివిల్లుని తలపించు హామీలు
ఎండమావులు కాగా
ఎన్నికల సమయాన ఇచ్చిన ఉచితాలను
అధిక ధరలు, శిస్తులతో వసూలు చేస్తూ
ప్రజలకు పట్టపగలే
చుక్కలు చూపించే నాయకులు
ఉచితాల రక్షణ వలయంలో ఉండగా
శిక్షలు పడవుగా!.
ఏటికి మూడు పంటల
మేలిమి బంగరు భూములను
రియల్ ఎస్టేట్ పేరిట
గ్రద్దల్లా తన్నకు పోతూ
అవని గర్భాన దాగిన
అపార ఖనిజ సంపదకై
అడవిని పడగొడుతూ
పుడమిని చెడగొడుతుంటే
వన్యప్రాణులకు నిలువ నీడ లేక
ఆకలిదప్పులతో అల్లాడుతుంటే
వికృతంగా నవ్వుకునే దొరల ముసుగునున్న
దొంగల చెంత
అధికార మంత్ర దండం ఉండగా
శిక్షలు పడవుగా!.
రంగ మేదైనా
అవినీతి అనకొండలకు
శిక్షలు పడాలంటే
ఎన్నికల సమయాన ఉచితాలకు కాక
నాయకుని వ్యక్తిత్వానికి ప్రాధాన్యం
ఇచ్చే
ఓటర్ల వల్లనే సాధ్యం...

-సంబరాజు రమణి

## వాళ్లే..!

కడిగిన ముత్యాల్లా కనబడే
కరడుగట్టిన హృదయాల
'భూ' బకాసురులు వాళ్ళు!.
చేయకూడని పనులు చేస్తూ...
శిక్షలనుంచి 'తప్పు'కునే కళలో
ప్రత్యేక శిక్షణ పొందిన
మహా జాదూలు వాళ్లు!.
ప్రకృతి సంపదను,
ప్రజాధనాన్ని దిగమింగే
వారసత్వపు 'ఆకలి'
తిమింగలాలు వాళ్ళు!.
ప్రభుత్వ ఆస్తులను
'ప్రైవేట్'కు కట్టబెట్టే
అబద్ధాలకోరులు వాళ్ళు!.
బ్యాంకు రుణాలను ఎగ్గొట్టి
దేశ విదేశాలు దాటేసి..
నిర్లజ్జగా పార్టీలు చేసుకునే
ఫోర్ ట్వంటీలు వాళ్ళు!.
నిలువెల్లా మోసాల
వేషాలు ధరించిన
ఖద్దరు నాయకులు..
పేద బతుకులను
బుగ్గి చేసే బడా బాబులు..
వికృత 'కలల' సాకారానికి
పరస్పర 'ఎర'లు వేసే...
పగటి వేషగాళ్లు వాళ్ళు!.
పంగ వేళ్ల 'విక్టరీ' విన్యాసాలతో
ప్రజలకు 'పంగనామాలు' పెట్టే
పొలిటికల్ మాఫియాలు వాళ్ళు!.
చదువుల వృక్షానికి
'కార్పొరేట్' చెదలెక్కించి
ఫీజులతో పాటు రక్తం పీల్చే
'కాసుల' జలగలు వాళ్ళు!
రోగుల్లో ప్రాణ భయం పెంచి
సిరెంజీల్లో 'కల్తీ' మందులతో
ఆర్థిక రోగగ్రస్తులను చేసే
'స్టేత్' హంతకులు వాళ్ళు!
యువత 'మెదళ్ల' నిండా
'డ్రగ్స్' విషాన్ని నింపుతున్న
'మత్తోన్మాదులు' వాళ్ళు!
'నాలుగుస్తంభాల'ను
గుప్పిట్లో బంధించి...
'బొటన వేలు' చూపిస్తూ..
విజయ గర్వంతో విర్రవీగే
ఈ ప్రజా భక్షకులకు
శిక్షలు పడవు తెలుసా!.
అయినా...
ఓ కొడిగట్టని 'ఆశ'
'ప్రజాస్వామ్య' శ్వాస
ఇంకా మిగిలే ఉంది!.
టన్నుల టన్నుల నోట్ల కట్టల్తో
ఊరిగే 'అవినీతి' ఏనుగులను
'అంబారీ' పైనుంచీ కిందకీడ్చే
నిస్వార్థపు పిడికిళ్లు
ప్రశ్నించే గళాలు ఉన్నంతకాలం
ప్రజా కోర్టుల్లో శిక్షలు పడకుండా
ప్రజా కంటకులెవరూ తప్పించుకోలేరు...
ఈ జీవితకాలపు ఆశ
మరెంతో దూరం లేదు!

-పుట్టంరాజు నరసింహామూర్తి



# భక్తి-సేవ-సాహిత్య మూర్తిరూపం రమణాచారి గారి “హరే శ్రీనివాసా!”

పరమ పవిత్రమైన శ్రీ వేంకటేశ్వరుడు అనే పదంలో వేంకట అంటే పాపాలను తొలగించే పర్వతం. ఈశ్వరుడు అంటే ఆ పర్వతంపై వెలసిన పరమేశ్వరుడు. అతను శాశ్వతుడు, జగన్నాథుడు. విష్ణువుని సాక్షాత్కార రూపం. భూదేవి,శ్రీదేవిలతో కూడిన సాక్షాత్కరించే సంపూర్ణమైన శాంతస్వరూపుడు. అతని దర్శనం కేవలం కళ్యాణం కాదు మోక్షానికి ద్వారం. శ్రీవారి ఆలయం భూమిపై వైకుంఠం. ఆయన నిలబడిన గర్భగుడి, ప్రపంచంలో అత్యంత పవిత్రమైన కేంద్రాల్లో ఒకటి. అక్కడికి భక్తుల పాదయాత్రలు మారు మస్తిష్కాన్ని మార్చేస్తాయి. ఆ ఆలయంలో ఒక్క క్షణమైనా నిలబడితే మన మనస్సు పరిపూర్ణమవుతుంది. ఆ కళ్ళలో కారుణ్యం ఉంది. ఆయన నిలుచున్న స్థితిలో విశ్వాన్ని నిలబెట్టే శక్తి ఉంది.

“ హరే శ్రీనివాస” అనే నామంలో సహస్రనామాలకు సమానమైన శాంతి ఉంది. శ్రీరామానుజులు, అన్నమయ్య, తాళ్ళపాక పాఠకులు, సంకీర్తనాచార్యులు, ఉద్యోగాన్ని కేవలం ఉద్యోగం లా కాకుండా శ్రీనివాసుని పాదపద్మాలను సేవించే తీరులో బాధ్యతలను స్వీకరించి అత్యంత భక్తి ప్రపత్తులతో కొనసాగించిన డాక్టర్ రమణాచారి గారి ప్రయాణం. వీటన్నింటికీ మూలాధారం ఆ తిరుమల వేంకటేశుడి అపారమైన దయ. వీరు చేపట్టిన ధర్మదీక్షకు ఆ శ్రీనివాసుడు చూపిన కరుణ.

అన్నమయ్య పదాల్లో: “వేంకటాద్రికి వెలసిన శ్రీనివాసుని సన్నిధిలో ఒక్క చూపు పడితే చాలు, జన్మ జన్మల పుణ్యం కలుగుతుంది. ఆయన స్వరూప విశిష్టత ఆ విగ్రహం గురించి చెప్పుకోవాలంటే ఏ భాష అక్షరాలు సరిపోవు. మనం ఎంతగా తలదించుకున్నా ఆయన ముఖారవిందం మన కన్నులకు కనిపించదంటే మనలో ఎక్కడలేని ఆత్మవిశ్వాసం పెరిగిపోతుంది. ఆ చేతుల్లో శంఖం, చక్రం ఉన్నా ఆ ఆశీర్వాద హస్తం భక్తులపై ఉంటుంది. తలపై శేషవస్త్రం, ఒడిలో లక్ష్మీదేవి ఆశీస్సు, భక్తుని గుండెల్లో ఒక వెలుగులా మారి శ్రీవారి ప్రతి విజ్ఞప్తి వినబడుతుంది కానీ కొందరికి వారి ఆశీర్వాద ఫలం కనిపించకపోవచ్చు. కానీ వినిపించకుండా ఉండే ఒక్క భక్తుడూ ఉండడు. సమాధానాలు శబ్దంలో ఉండవు. అవి జరిగే సంఘటనల పరిణామాలలో ఉంటాయి, ఊహించని అనుగ్రహంలో ఉంటాయి.

కానీ భగవంతుడు దూరంగా ఉంటాడన్న భావన అసలు భక్తికి విరుద్ధమైనది. ఆయన ఎప్పుడూ మన మధ్యే ఉంటాడు. మనం ఆయన్ని గుర్తించేంత వరకు మాత్రం ఆయన మన కళ్లకు తెలియడు. మన మనస్సు నిజంగా ఆయన్ని పిలిచినప్పుడు, మన ఆత్మ లోతుల్లోంచి ఆయనకు తలవంచినప్పుడు, ఆయన ప్రతిస్పందన మన జీవితాన్ని మార్చేదిగా ఉంటుంది. ఆయన ఎప్పటికీ దూరంగా ఉండడు. కేవలం మనం ఆయన వైపు తిరిగే వరకు ఆయన మౌనంగా ఉంటాడు. కానీ మనం ఒక్క అడుగు వేస్తే, ఆయన మనం ఊహించని రీతిలో ఎదురొస్తాడు. ఈ గ్రంథంలో నేను చెప్పబోయే అనుభవాలు-అన్ని ఒక్కే సత్యాన్ని సూచిస్తున్నాయి

ఇలాంటిదే గౌరవనీయులు డాక్టర్ రమణ గారి జీవితంలో జరిగింది. తిరుమల శ్రీనివాసుడిని దర్శించుకున్న ప్రతిసారీ, నా మనసులో ఒక చిన్న అనుమానం, ఒక చిన్న కోరిక మెదిలేది “స్వామీ, నీవు ఎప్పటికీ భక్తులే నీ దగ్గరకు రావాలని చూస్తావా? నీవే ఎప్పుడైనా వారి దగ్గరకు రావాలను కోరా?” ఈ ప్రశ్నకు స్వామివారు నవ్వుతారేమో అనిపించేది. కాలక్రమంలో, ఊహించని సంఘటనలు జరిగాయి. ఒకనాడు టీటీడీ ఈవో పదవి ఖాళీ అయిందని విన్నప్పుడు, వీరి మనసులో ఓ చిన్న ఆశ మెరిసింది. “ఈ పదవి తనకు రావచ్చు కదా ! అనుకోగానే .” అప్పటి ముఖ్యమంత్రి డా. వై. ఎస్. రాజశేఖర్ రెడ్డి గారు ఒక్కసారిగా పిలిచి, “రమణా, ఈ దేవాలయానికి ఈవోగా నీవు బాధ్యత తీసుకుంటే బావుంటుంది” అని అనగానే, ఆ మాటల్లో ఒక ఆధ్యాత్మిక సంకేతం వినిపించింది. ఈ పుణ్యక్షేత్రంలో పనిచేయడం అనేది కేవలం ఉద్యోగం కాదు అది భగవత్ సేవ, అది భక్తిలో భాగంలా వీరు భావించారు. ఈ యాత్రలో ఎన్నో అనుభూతులు, అనేక దర్శనలు, అనేక అనుభవాలు కలిశాయి. వాటిని సాక్షాత్కారాలుగా, వ్రతాలుగా, అర్చనలుగా రమణాచారి గారు అనుభవించారు. ఆ అనుభూతులే ఈ గ్రంథంలో పత్రాలపై ఆవిర్భవించాయి.”

ఈ అనుభవం తర్వాత, తిరుమల

> ఒకనాడు టీటీడీ ఈవో పదవి ఖాళీ అయిందని విన్నప్పుడు, వీరి మనసులో ఓ చిన్న ఆశ మెరిసింది. “ఈ పదవి తనకు రావచ్చు కదా ! అనుకోగానే .” అప్పటి ముఖ్యమంత్రి డా. వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారు ఒక్కసారిగా పిలిచి, “రమణా, ఈ దేవాలయానికి ఈవోగా నీవు బాధ్యత తీసుకుంటే బావుంటుంది” అని అనగానే, ఆ మాటల్లో ఒక ఆధ్యాత్మిక సంకేతం వినిపించింది. ఈ పుణ్యక్షేత్రంలో పనిచేయడం అనేది కేవలం ఉద్యోగం కాదు అది భగవత్ సేవ, అది భక్తిలో భాగంలా వీరు భావించారు.

వేంకటేశుడిపై నాకు ఉన్న విశ్వాసం మరింత బలపడింది. ఆయన గురించి ఎంత చెప్పినా తక్కువే. ఏడుకొండల మీద వెలసిన వేంకటేశుడు కేవలం మూర్తిమంతమైన విగ్రహం కాదు. ఆయన అనుభూతి. ఆయన ఒక ఆత్మస్వరూపం. వేదాలు, పురాణాలు, ఆలయ శాసనాలు అంతా ఆ ఏడుకొండలవాడి మహిమ. వేంకటేశుడు వైకుంఠవాసుడు. కానీ భూమిపై ఆలయం కట్టించుకొని భక్తుల కోసం స్వయంగా ఉండే స్వామి. భూదేవి, శ్రీదేవులతో పాటు భక్తుల తపస్సును అంగీకరించి తిరుమలలో తానుగా నివసించే దయామయుడు. ఆయన దర్శనం కలగడం ఒక యాత్ర కాదే అది ఓ

> ఏ పని అయినా తాను చేసే ప్రతి పనిలో నిబద్ధతను అనుసరిస్తున్న వీరు వృత్తిపరంగా ఎన్ని మార్పు లొచ్చినా అంతా దైవేచ్ఛ అనుకోవడం వీరిలోని స్థితప్రజ్ఞతను చూపుతుంది.

మౌనానుభవం. గర్భగుడిలో ఆయనను దర్శించే క్షణంలో, మన మనస్సు కదలదు. భక్తితో నిలిచిన మూర్తిని చూస్తూ ఉండిపోయే ఆ క్షణం ఒక జీవితం అంతకంటే విలువైనదిగా అనిపిస్తుంది. తిరుమల శిఖరాల్లో నిలిచే వేంకటేశుడు, మన కళ్లకే కాకుండా మన హృదయానికీ దర్శనమిచ్చే స్వామి పట్ల అత్యంత భక్తితో పంచుకున్న అనుభవ మాల డాక్టర్ రమణాచారి గారు వివరాల లోకి వెళితే ..

కారంచేడు వెంకట రమణాచారి మాజీ ఐఏయస్ అధికారి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక సలహాదారుడు. దేవాదాయ శాఖ కమీషనర్ గా, తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా, దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శిగా, దేవాదాయ శాఖలో ఉన్న ఈ మూడు ఉన్నతపదవులను నిర్వహించారు. 2012 డిసెంబర్లో ఆయన స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. పరిపాలనా రంగంలోనే కాకుండా, సాహిత్య, సాంస్కృతిక, ఆధ్యాత్మిక రంగంలో వారికున్న ప్రతిభ అందరికీ తెలిసిందే. ఆయన తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అధ్యక్షులుగా కూడా వ్యవహరిస్తున్నారు.

1952, ఫిబ్రవరి 8 వ తేదీన కెవి రాఘవాచారి, శ్రీమతి పద్మావమ్మ గార్ల కు మెదక్ లో జన్మించిన డాక్టర్ రమణాచారి గారి జన్మ వివరాలు, జీవిత వివరాలు చదువు తుంటే ఖచ్చితంగా కారణజన్ములు అనిపిస్తుంది. తల్లినుండి ఆంగ్లం, తండ్రి నుంచి సంస్కృతం, తెలుగు శిక్షణ, తాతయ్యనుండి తమిళ పాశురాలు లు కలిసి రమణాచారి గారికి బహుభాషా కోవిదులుగా తీర్చిదిద్దగ లిగాయి. చదువే సర్వస్వంగా భావించిన వీరికి చదువులోనే కాకుండా అనేక వక్తృత్వపోటీలలోనూ, ఏకపాత్రాభినయం, వ్యాసరచన, పద్యగానాలలో విశేష విజ్ఞానాన్ని కనపరిచేవారు. 1969 జనవరిలో తెలంగాణలో ఉద్యమాల తీవ్రంగా ఉన్నపుడు వీరు డిగ్రీ చదువుతుండేవారు. అపుడు “ నా తెలంగాణ కోటి రతనాల వీణ” అనే దాశరధి మాటను విశ్వసించి ప్రత్యేక తెలంగాణ కోసం సర్వశక్తుల్ని కూడగట్టుకుని ఉద్యమంలో కూడా నాయకత్వాన్ని ప్రదర్శించారు. ఆ సమయాల్లో పోలీసు స్టేషన్‌కు వెళ్ళిన ఒక సందర్భంలో తానున్న సంగారెడ్డి జైలునే ఏకంగా విహార కేంద్రంగా మార్చి అందరి మన్ననలు పొంది ఏకైక వ్యక్తి రమణాచారిగారు అంటే అతిశయోక్తి కాదు. జైలుకెళితే ఏదో కానిపని చేసారేమో అనుకునే రోజుల్లో రాష్ట్రంకోసం మనవాడొకడు జైలుకెళుతున్నాడు “జాగ్రత్తరా రమణా” అన్న రమణాచారి పెదనాన్న మాటలు ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉన్నాయి కదా అనిపించక మానదు..

1970 సం॥లో తన బియస్సీ ఫస్టుక్లాస్‌లో పాసై ఎమ్మెస్సీ చదివే రోజుల్లో ఇంటి ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా పరిశోధనను తాత్కాలికంగా ఆపి ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలో మెదక్ జిల్లా జగదేవ్ పూర్ జూనియర్ కళాశాలలో కెమిస్ట్రీ లెక్చరర్‌గా కొంతకాలం పనిచేసారు. ఎమ్మెస్సీ పూర్తిచేసాక సైఫాబాద్ సైన్స్ కళాశాలలో లెక్చరర్‌గా నియమింపబడ్డారు. అక్కడితో వీరి జీవితంలో రెండు కోణాలు పాతాలు చెప్పడం తోపాటుగా, సాంస్కృతిక కళారంగాలు కూడా చోటుచేసు కున్నాయి. అనేకమంది ప్రముఖులతో పరిచయాలు, స్నేహాలు ఈ గ్రంథంలో చదువుతూంటే ఒక్క జీవితంలో అనేక జీవితాల అనుభవసారం కనిపించింది.

కె.వి.రమణాచారి 1982 ప్రాంతాలలో ఆంధ్రప్రదేశ్ కేడర్ కి చెందిన ఐ.ఏ.యస్. అధికారిగా నియమింపబడ్డారు. 1986లో గోదావరి తీవ్రమైన వరదలు వచ్చినప్పుడు రమణాచారి పశ్చిమగోదావరి జిల్లాలో పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించారు. 2012 వరకు ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ, ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ బోర్డ్, సమాచార శాఖ, తిరుమల తిరుపతి దేవస్థానం మొదలైన అనేక శాఖలకు ఉన్నత అధికారిగా బాధ్యతలు నిర్వహించారు.

2013 లో ఆంధ్రప్ర దేశ్ రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక సలహాదారుగా నియమితులయ్యారు. 2010లో ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ నుంచి తెలుగు పద్య కవి త్వం మీద పి. హెచ్. డి పట్టా పొందారు. నిజాయితీ, నిబద్ధత కలిగిన ప్రభుత్వాధికారిగా వీరికి విశేషమైన గుర్తింపు లభించింది. సాహిత్యం, కళలు, నాటకం మొదలైన అంశాల పట్ల విశేషమైన అభిమానం కల్గి రాష్ట్రంలోని







అనేక సాహితీ, కళా సంస్థలకు అనేక రకాలుగా సహాయ సహకారాలు అందించారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం పక్షాన నంది నాటకోత్సవాలు

> సాహిత్యం, కళలు, నాటకం మొదలైన అంశాల పట్ల విశేషమైన అభిమానం కల్గి రాష్ట్రంలోని అనేక సాహితీ, కళా సంస్థలకు అనేక రకాలుగా సహాయ సహకారాలు అందించారు.

నిర్వహించడం రమణా చారి కృషివలనే ప్రారంభమయ్యాయి.

మంచి చేయడానికి స్థానమేమిటి? పదవేమిటి? ఎక్కడయినా, ఎపుడైనా చేయవచ్చుననే సంకల్పంతో ‘అద్భుతాల సృష్టికి ఏ శాఖ అయినా ఒకటే” అంటారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ పట్ల ఆశతో చూసేవారి సంఖ్య చాలా ఉంటుంది. దానికి డైరక్టరయ్యే వ్యక్తికి మంచి హృదయముండాలి. కళాకారులను గుర్తించే సంస్కారం ఉండాలి. దేశ సాంస్కృతిక వైభవం పట్ల సంపూర్ణ అవగాహన ఉండాలి. కెవి రమణ గారు సాంస్కృతిక శాఖ సంచాలకులుగా లలిత కళాతోరణంలోకి చేరుకోగానే ఆ ఏదయినా కార్యక్రమం ఉన్నపుడు మాత్రమే కళకళలాడుతుండటం, మిగిలిన సమయం నిర్మానుష్యంగా ఉండటాన్ని హర్షించలేకపోయేవారట. వెంటనే ఎంతో కష్టతరమైన పనిని ఎంతో పట్టుదలతో పోరాడి, ఆ కార్యాలయాన్ని రవీంద్ర భారతి ప్రాంగణంలోని కళాభవన్‌లోకి మార్చడం అనేది చదువుతుంటే వీరిలోని కార్యదీక్ష మనకు బోధపడుతుంది. నీతికి కళ్ళు రెండయితే, నిజాయితీకి హృదయం ఒకటే. అంటే చూసే కళ్ళల్లో మార్పు ఉండచ్చు కానీ ఆలోచించే మనసులో మాత్రం ఒకటే హృదయముండాలనేది ఇక్కడ మనకు అర్థమవుతుంది. మనిషి తన ఆలోచనా విధానాన్ని అనుసరించే తీరులోనే వారిలోని వ్యక్తిత్వం మనకు విశదమవుతుంది. కొన్ని నెలల కాలంలోనే అందరికీ చేరువైనా మరెందరికో కంటగింపై 1991 సెప్టెంబరు మాసంలో సాహితీ సాంస్కృతిక రంగాల్లో తిరుగులేని రాజులా వెలుగొందుతున్న రమణ గారికి ఆర్నెల్లు తిరక్కముందే ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ వంపింది. తర్వాత నగరాభివృద్ధికి అడ్మినిస్ట్రేటర్‌గా ఉండటం, ఆ తర్వాత కడపజిల్లా కలెక్టర్‌గా పనిచేయడం జరిగింది. ఏ పని అయినా తాను చేసే ప్రతి పనిలో నిబద్ధతను అనుసరిస్తున్న వీరు వృత్తిపరంగా ఎన్ని మార్పు లొచ్చినా అంతా దైవేచ్ఛ అనుకోవడం వీరిలోని స్థితప్రజ్ఞతను చూపుతుంది. అందుకేనేమో.. నేడు అందరికీ స్ఫూర్తిగా నిలుస్తూ ప్రజల మనిషిగా నిలిచిపోయారు.

నేడు వీరు రచించిన ఆధ్యాత్మిక అనుభవైక సారాంశం “హరే శ్రీనివాస” గ్రంథం వీరి జీవితంలో జరిగిన అనేక సంఘటనల అనుభవాల సారం. ఏ స్థానంలో వున్నా మనిషి సమాజంలో వివిధ మనస్తత్వాల మధ్య, వింత వింత పోకడల మధ్య, ఇష్టంలేని పరిస్థితుల మధ్య, వ్యక్తుల మధ్య, సంభాషణల మధ్య, జీవన విధానాల మధ్య జీవించాల్సిందే.. ఒక్క కుటుంబంలోనే భిన్నత్వం కలిగివు న్నప్పుడు సమాజంలో వుండటం అంత ఆశ్చర్యం కాదు కదా? అయితే మనదైన, మనది కాని ఈ సమాజం లో ఒక వ్యక్తిని ఒకటే అభిప్రాయం వుండటం ఎంతవరకు ఆశిస్తాం? ఈ సృష్టిలో ఏ రెండు మనసులు, ఏ రెండు మెదడులు, ఏ రెండు ఆలోచనలు ఒకేలా ఉండవు అనేది ఎంతో నిజమైనప్పుడు మనిషికి సమస్యలు తప్పవు. ఇంత మాత్రం విషయం విజ్ఞులయిన నిలువెత్తు సంస్కార మూర్తి అయిన రమణాచారి గారికి ఒక వ్యక్తిని, సమాజాన్ని అంచనా వేయడం ఒక విషయమా? చెప్పండి. విషయాల్లోకి వెళితే..

తిరుమల తిరుపతి దేవస్థానంలో “అఖండ దీపం ఎలా వెలుగుతోందో? అఖండ హరినామ సంకీర్తన ఎందుకు జరగకూడదు? అనుకుని తర్జన భర్జన అవ్వడం, చివరికి అన్నివిధాల ఆమోదింపబడి హరినామ సంకీర్తన జరగడం యాధృచ్ఛితం కాక మరేమిటి? ఏ మంచి పని, ఒక గొప్పపని జరగాలంటే అనేక గొంతులనుండి అంగీకారం రావాలి. అన్ని గొంతుల నుండి పలికేది ఆ శ్రీనివాసుడే అయినప్పుడు ఒక మంచి పని శ్రీకారం ఎందుకు పలకడు? కాకుంటే ఈ మధ్యలో జరిగేదంతా మన సహనానికి పరీక్షే కదా? కాకుంటే ఆ నిర్ణయానికి మాత్రం ఒక వారధి కావాలి. ఆ వారధి ఆ భగవంతుడి ఎంతో ఇష్టుడై వుంటాడంతే! అలాగే శ్రీ తిరుమలేశుని ఉత్సవ విగ్రహాన్ని గ్రామ గ్రామానికి మూడు రథాలతో ఊరేగింపు, దేవదేవుడు అందరికీ కనువిందు చేయాలనే సంకల్పం ఎన్నో అవాంతరాలను దాటి ప్రజలకు దర్శనం కావడం పట్ల చూపిన శ్రద్ధ, చేసిన స్మరణ గురించి చదువుతుంటే ఒళ్ళు పులకరిస్తుంది.

ఈ సంఘటన మన కోరికలో ధర్మం వుంటే తప్పక నెరవేరుతుంది అనడానికి ఒక ఉదాహరణగా నిలుస్తుంది. భక్తుల సంఖ్య పెరుగుతోంది అంటున్నారు కానీ అలా పెరుగుతున్న భక్తుల సంఖ్యకు తగినట్లుగా సదుపాయాలు ఎక్కడ పెంచుతున్నారు? అవే సత్రాలు? అన్ని ప్రశ్నలకి మొక్కుబడిగా జవాబులు” అంటూ డయల్ ప్రోగ్రాం’ అనే కార్యక్రమంలో ఒక భక్తుడు కోదండపాణి అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఎంతమంది బోర్డు మెంబర్లు అనేక కారణాలతో వ్యతిరేకించినా మన రమణాచారి గారు ఎంతో పట్టుదలతో ‘వైకుంఠం’ క్యూ కాంప్లెక్స్ అంతా ఏసీ చేయడం, ఉచిత భోజన వసతిని కలిపించడం, కాలినడకన వచ్చే భక్తులకు దారిలో ఫలహారం ఏర్పాటు చేయడం, తిరుచానూరు అమ్మవారి ఆలయం చుట్టూ క్రిక్కిరిసి వుండే వీధుల్ని వెడల్పు చేయించడం వంటి సదుపాయాలు కల్పించడం అనేది ఆ దైవ కృప కాక మరేమిటి?

అలాగే వివాహం ప్రాశస్త్యం శాస్త్రోక్తంగా ఎరిగివున్న వీరు ‘కళ్యాణమస్తు’ కార్యక్రమాన్ని విస్తృతం చేసి తద్వారా ప్రాంతీయ, కుల, వివక్షలు లేకుండా ప్రతి పేద వధూవరులకు స్వామివారిపేరుతో సేవను ఒకరికా ఇద్దరికా ఏకంగా 6,373 వేలమంది జంటలకు

> ఒక వ్యక్తి గొప్పవారు అనిపించుకోవాలంటే ముఖస్తుతిగా పెద్ద కష్టమేమీ కాదు. వారు ఎదురుగా లేకున్నా కూడా ఒక వ్యక్తి పేరు తలుచుకోగానే గొప్పవారు అనిపించుకోవాలంటే అత్యంత కష్టతరం. ఎందుకంటే మనమంతా నాటకరంగంలో అనేక పాత్రలలో ఇమిడిపోయి జీవించేస్తున్నాం అనుకుంటున్నాం. కానీ కొందరు మాత్రమే ప్రతి ఒక్కరి మన్ననలూ పొందగలిగేవారుంటారు. అలాంటి వ్యక్తులలో రమణాచారిగారు ఒకరు.

అందించి పేదల జీవితాలకు ఒక అర్థం, ఆనందం కలిగించేలా ప్రయత్నం చేసి ఎన్ని అవాంతారాలు ఎదురైనా విజయవంతం అయ్యేలా చూడటం ద్వారా ఎంతోమంది ప్రముఖుల అభినందనలు అందుకు న్నారు. పేదల ఆశీస్సులు కూడా అందుకునే వుంటారు. కాకుంటే 2009 వ సంవత్సరంలో వీరికి బదిలీ అయితే 2011 సంవత్సరంలో ఈ కార్యక్రమం నిలిచిపోవడం పట్ల వీరికి అత్యంత ఆవేదన కలిగించడం న్యాయమే కదా? ధర్మానికి కాలపరిమితి తక్కువనేది నిజం కదా?

ఉదయం నిద్రలేవగానే శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్’ ను ఆన్ చేసుకుని ఆ వచ్చే కార్యక్రమాలను చూస్తూ, పాటలను వింటూ దాదాపు తొమ్మిది గంటల దాకా గడిపే నేను, నాతో పాటు అనేక మంది మా బంధుమిత్రులకు, అనేకమంది ఆ

> ఏ స్థానంలో వున్నా మనిషి సమాజంలో వివిధ మనస్తత్వాల మధ్య, వింత వింత పోకడల మధ్య, ఇష్టంలేని పరిస్థితుల మధ్య, వ్యక్తుల మధ్య, సంభాషణల మధ్య, జీవన విధానాల మధ్య జీవించాల్సిందే..

తిరుమల శ్రీనివాసుని భక్తులకు ఈ అద్భుతమైన ఛానెల్‌ను ప్రారంభించడానికి ఇంత ప్రయాస, కష్టం, మానసిక సంక్షోభం వుందా? ఇందులో నాకు తెలిసిన మహోన్నతులు రమణాచారి గారు ఉన్నారని తెలుస్తుంటే కళ్ళు చెమర్చాయి.

నిజానికి వీరు ఈ అనుభవాలు ఇలా గ్రంథం ద్వారా తెలపకుంటే ఇన్ని మంచి కార్యక్రమాలకు రమణాచారి గారి పోరాటం, ఆరాటం ఎంతలా సాగిం దో తెలియకనే జీవితాలు గడిచిపోయేవి. సామాన్యులమైన మాలాంటి వారికి కూడా ఈ అదృష్టం కూడా ఆ శ్రీనివాసుడే కలిగించాడేమో అనిపి స్తోంది. ఆ తర్వాత 32000 సంకీర్తనలను రచించి పాడిన భక్తాగ్రేసరుడు శ్రీ తాళ్ళపాక అన్నమయ్య పేరిట ‘అన్నమాచార్య ప్రాజెక్టు’ ను నెలకొ ల్పారు. తద్వారా 600 వ జయంతి ఉత్సవాలు అదీ తాళ్ళపాక గ్రామంలో 108 అడుగుల అన్నమా చార్యుని విగ్రహ ప్రతిష్ఠ అప్పటి ముఖ్యమంత్రి డా॥ రాజశేఖర్ రెడ్డి చేతులమీదుగా చేసారు. ఆ విగ్రహం సమీపంలోనే అన్నమయ్య సంకీర్తనా మందిరం కూడా ఏర్పాటు చేసారు. అంతేకాకుండా ఖచ్చితంగా 1116 మంది సంగీత కళాకారుల గానామృతంతో అత్యంత వైభవంగా జరిపించారు. ఇక్కడితో ఆగకుండా అన్నమాచార్యుని వారసులు ఇప్పటికీ ఆ శ్రీనివాసుని సుప్రభాత సేవలో తరిస్తున్నారని తెలిసి, వారు ఎక్కడున్నా నెలకు 5000 రూపాయలు జీవనభృతిని టీటీడీ కల్పించడం, అదీ రమణాచారి గారు విధి నిర్వహణలో వుండగానే జరగడం ద్వారా ఆ స్వామి కృపా కటాక్షాలు వీరిపై నిత్యం వున్నాయని చెప్పవచ్చు. అంతేకాకుండా ఆ పదకవితా పితామహుడు అన్నమాచార్యులు జన్మించిన గ్రామం తాళ్ళపాక ను టీటీడి వారు దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలనే బాధ్యతను చేపట్టారు. నిజంగా రమణాచారి గారి 35 ఏళ్ళ డిప్యూటీ కలెక్టర్ నుండి, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి వరకు ప్రతి పోస్టులోనూ ఒక ప్రత్యేక ముద్ర కలిగే అవకాశాన్ని, ముఖ్యంగా తిరుమల తిరుపతి దేవస్థానాల ఎగ్జిక్యూటివ్ ఆఫీసులో చేపట్టిన ప్రతి కార్యక్రమం లోనూ పరీక్షలు ఎదుర్కున్నా, పరిష్కారాన్ని కూడా చూపిన అదృష్టాన్ని అంతా ఆ శ్రీనివాసుడే కల్పించాడని వీరు భావించడం కూడా లోక కళ్యాణమే కదా?

ఒక వ్యక్తి గొప్పవారు అనిపించుకోవాలంటే ముఖస్తుతిగా పెద్ద కష్టమేమీ కాదు. వారు ఎదురుగా లేకున్నా కూడా ఒక వ్యక్తి పేరు తలుచుకోగానే గొప్పవారు అనిపించుకోవాలంటే అత్యంత కష్టతరం. ఎందుకంటే మనమంతా నాటకరంగంలో అనేక పాత్రలలో ఇమిడిపోయి జీవించేస్తున్నాం అనుకుంటున్నాం. కానీ కొందరు మాత్రమే ప్రతి ఒక్కరి మన్ననలూ పొందగలిగేవారుంటారు. అలాంటి వ్యక్తులలో రమణాచారి గారు ఒకరు. ఎంత గొప్ప జీవితం? ఎన్ని ప్రామాణిక పరిచయాలు? ఎంత పోరాటం? ఎంత సంఘర్షణ? గొప్ప చదువు, ఉన్నతమైన పదవి అన్నీ కలిగి వుండీ కూడా మనలో ఒకరుగా, మనతో పాటు కలిసిపోవడం ఎలా సాధ్యం? వీరి జీవితం నుండి ఒక్కరోజు జీవితాన్నైనా మనం అనుభవించగలమా? అంటే లేదనేదే సమాధానం. అందుకే కదా వీరు గొప్పవారయ్యారు. ఎవరితో వీరి గురించి మాట్లాడినా నమస్కారం తప్ప మరే మాట వినిపించనంత మహనీయులయ్యారు. బహుశా ఆ తిరుమల వేంకటేశుని భక్తి తత్త్వం వీరిలో పూర్తిగా నిండివుండటమే కారణమేమో! ‘హరే శ్రీనివాసా’ అనేది ఒక పదం మాత్రమే కాదు. ఒక మంత్రం.. ఆ మంత్రం మనం స్మరించుకుందాం! ఈ గ్రంథాన్ని గొప్ప ఆధ్యాత్మిక గ్రంథంలా మనం చదువుకుందాం! భగవంతుని దయ వుంటే ఏదయినా సాధ్యమేననే సూత్రాన్ని గ్రహిద్దాం..! ఈ అత్యుత్తమమైన గ్రంథం నాకు చదివే భాగ్యం కలగడం, చదివి, నాకు సాధ్యమైనంత మేర విశ్లేషించగలగడం కూడా ఆ తిరుమల శ్రీనివాసుని దయగానే భావిస్తున్నాను. గ్రంథం అందించినందుకు డాక్టర్ రమణాచారి గారికి పాదాభివందనాలు తెలియజేస్తున్నాను.

**ప్రతులకు:** ఎమెస్కో బుక్స్ ప్రై.లి., 1-2-7, బానూ కాలనీ, దోమల్‌గూడ, హైదరాబాద్-29




-శైలజామిత్ర
9290900879

